J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 27 05.12.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

• సమతుల్యమా....సామరస్యమా..?

# ముచ్చటగా మూడు జోన్ల పాలసీ!



- అమరావతిపై మూడేళ్ళలో రూ.లక్ష కోట్ల పెట్టుబడి
- ఇతర ప్రాంతాల్లో అసంతృప్తి రాకుండా జాగ్రత్తలు
- మూడు జోన్ల విధానంతో ముందుకెళ్ళాలని నిర్ణయం

ఎంత కష్టమైనా తాను చేయాలనుకున్నది చేసేయడం, దానికి ప్రజామోదం లభించేలా చేసుకోవడం ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకి వెన్నతోపెట్టిన విద్య. విజయవాడ, గుంటూరు వంటి పెద్ద నగరాలను కాదని, వాటి మధ్య ఉన్న ప్రాంతాన్ని రాజధానికి ఎంపిక చేశారు. వర్షం వస్తే మునిగిపోతుందని, కృష్ణానదిలో కలిసిపోతుందని, ప్రతిపక్షాలు, మేధావులు గగ్గోలు పెడుతున్నా లెక్కచేయలేదు. తాను అనుకున్న అమరావతికే ఆయన ప్రాధాన్యత ఇచ్చారు. కాబోయే కలల రాజధాని ఇదే అంటూ ఆంధ్రప్రాంత ప్రజలకు పరిచయం చేశారు. అయితే, ఈ క్రమంలో జగన్ ప్రభుత్వం ఏర్పడి లెక్కలేనన్ని సవాళ్లు ఎదురయ్యాయి. అనేక డెక్కాముక్కీలు తినాల్సి వచ్చింది. అయినా చంద్రబాబు వెనకడుగేయలేదు. తన ప్రయత్నాన్ని ఆపలేదు. 2లో

రాజకీయ ముసుగులో..

## రాక్షసి మహిళలు

తులసివనంలో గంజాయి మొక్కల్లా...

నిడిగుంట అరుణ, అరవ కామాక్షి

నెల్లూరు పరువు తీస్తున్నారు 3లో

మాట.. తప్పిన నేతలు

## గర్జిస్తున్న గూడూరు

ప్రభుత్వ నిర్ణయం సముచితం కాదంటున్న సోమిరెడ్డి

ఆమరణ దీక్ష చేస్తానంటున్న నల్లపరెడ్డి

ఉద్యమిస్తున్న గూడూరు ప్రజలు 12లో



# కాకాణి అడ్డగోలు ఆరోపణలపై..
# విచారణ జరపండి

## • పోలీసులకు ఫిర్యాదు చేసిన సోమిరెడ్డి



మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తనపై చేస్తున్న ఆరోపణలపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. అంతేకాదు, తనపై కాకాణి చేస్తున్న ఆరోపణలను విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలంటూ నెల్లూరు రూరల్ పోలీసులను కోరుతూ, ఈనెల 3న కాకాణిపై ఫిర్యాదు చేశారు కూడా. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, కాకుటూరులోని శివాలయం వద్ద మట్టిరోడ్డుపై సిమెంటు రోడ్డు వేస్తే కాకాణికి ఎందుకు కడుపుమంట? అని ప్రశ్నించారు. తాను మహాశివుడికే శఠగోపం పెట్టానని, శివుడి భూమినే కాజేశానని కాకాణి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని, దాదాపు 60 కోట్ల విలువైన భూములను పాఠశాలలు, ఆసుపత్రి, కాలనీలకు ఉదారంగా ఇచ్చేసిన ఘనత తమ సోమిరెడ్డి కుటుంబానిదని చెప్పారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి కానీ, ఆయన కుటుంబం కానీ ప్రజలకు ఏమిచ్చారో చెప్పండని ఆయనన్నారు. దళితుల భూములు, విశ్రాంత ఉద్యోగుల స్థలాలు కబ్జా చేసిన ఘనత కాకాణి కుటుంబానిదని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నో ఆస్తులను ఉదారంగా వదిలేసిన తాము శివాలయం భూమిని అమ్ముకుంటామా?..విమర్శలు చేసేటప్పుడు నోటికిదోస్తే అది మాట్లాడేయడమేనా?.. ఆమాత్రం జ్ఞానం ఉండక్కరలేదా అంటూ ఆయన కాకాణి తీరును దుయ్యబట్టారు. శివాలయం భూమి ఒక్కసెంటు కూడా ఎవరికీ రిజిస్టర్ కాలేదన్నారు. 11మంది కమిటీగా ఏర్పడి శివాలయం నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారని, వారి అంగీకారంతోనే మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చారని, జరిగింది ఇదయితే తాను రూ.కోటి తీసుకుని శివాలయం భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నానని చెప్పడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇరిగేషన్ శాఖలో దొంగ బిల్లులు చేసుకుని కోట్లాది రూపాయలు తినేసింది కాకాణేనంటూ దుయ్యబట్టారు.

# విలీనంపై మంత్రి ఆనం స్పందించరేం?

## • రాంకుమార్‌రెడ్డి విమర్శ



కలువాయి, రాపూరు, సైదాపురంలు గూడూరు డివిజన్‌లో విలీనంపై మంత్రి ఆనం స్పందించరేం?.. అప్పట్లో సాకుగా చెప్పిన సాగునీటి ప్రాజెక్టుల సమస్యలు ఇప్పుడు లేవా?.. అని వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 2న వెంకటగిరిలోని తమ నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, గూడూరు నెల్లూరులో విలీనంపై గత ఎన్నికలప్పుడు చంద్రబాబు, యువగళం పాదయాత్రలో లోకేష్‌లు ఇచ్చిన హామీలేమయ్యాయో టీడీపీ నేతలే చెప్పాలన్నారు. వెంకటగిరి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశం స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల ఉన్నత స్థాయిలో ఎక్కడా ప్రస్తావించినట్లు లేదన్నారు. తమకు సలహాలు అక్కర్లేదన్న ఎమ్మెల్యే కురుగొండ్ల నియోజకవర్గ అభివృద్ధికి మూలాధారమైన ఆల్తూరుపాడు రిజర్వాయర్, వెంకటగిరి పట్టణ ప్రజల భవిష్యత్తు తాగునీటి అవసరాలకు అప్పట్లో మంజూరైన అమృత్ 2.0 ప్రాజెక్టులను పట్టించుకోవడం లేదన్నారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రజల అభీష్టం మేరకే మండలాల విలీనం జరగాలని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో సమస్యలు ఎన్నో ఉన్నప్పటికీ, సైదాపురం మైన్ల తనిఖీలపైనే ఎమ్మెల్యే కురుగొండ్ల ఎందుకు దృష్టి సారిస్తున్నారోనని ఆయన విమర్శించారు. కోటి సంతకాల సేకరణకు స్పందన లేదన్న విమర్శలను ఆయన ప్రస్తావిస్తూ, కొన్ని పత్రికల వార్తలను చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో నెల్లూరు ప్రతిష్ట దిగజారిపోయిందని, లోపించిన శాంతిభద్రతలతో వారానికో హత్య జరుగుతోందని, గంజాయి హబ్ వంటి విషసంస్కృతి వ్యాపించిందని ఆయన విమర్శించారు.

# ముచ్చటగా మూడు జోన్ల పాలసీ!

(మొదటిపేజీ తరువాయి)

చివరికి ఎలాగోలా అధికారం చేపట్టి అమరావతికి జవసత్వాలు నింపేందుకు కంటిమీద కునుకులేకుండా భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో అమరావతిపైనే మొత్తం ఖర్చుచేస్తున్నారని, దానికోసమే రాష్ట్ర సంపద మొత్తాన్ని కేటాయిస్తున్నారని, రాజధాని కోసమే భారీగా అప్పులు చేస్తున్నారనే ప్రచారం రోజురోజుకూ ప్రజల్లో బలం పుంజుకుంటోంది. ఈ విషయాన్ని చంద్రబాబు గుర్తించారని, అందుకోసమే అన్ని ప్రాంతాలకు సమాన అభివృద్ధి, అందరినీ సమ దృష్టితో చూస్తాం అని చాటిచెప్పే విధంగా ప్రస్తుతం మూడు జోన్ల పాలసీ తీసుకొచ్చారనే ప్రచారం సాగుతోంది. ఇదే నిజమైతే అటు ప్రజల కష్టాలు పోవడంతో పాటు రాష్ట్రాభివృద్ధి కల కూడా సాకారమవుతుంది.లేకుంటే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో జగన్ తీసుకొచ్చిన మూడు రాజధానుల తరహాలోనే అట్టర్‌ఫ్లాప్ అవడం ఖాయమనే వాదనలు వినిపిస్తున్నాయి.

## అసలు అమరావతి ఎందుకంత స్పెషల్!

నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా తన తొలి అంచెలో రాజధాని అమరావతి నిర్మాణానికి చంద్రబాబునాయుడు ప్రణాళికలు రచించి ప్రధాని మోదీతో 2015లో ఘనంగా ప్రారంభోత్సవం కూడా చేయించారు. విభజనతో అన్యాయమైపోయిన సగటు ఆంధ్రుడు గర్వంగా తలెత్తుకునేలా చేసి, ఇకపై మేం నిర్మించుకుంటున్న మా రాజధాని మాకూ ఉండబోతోంది, అని గర్వంగా చెప్పుకోవచ్చంటూ ఆంధ్రులకు కొత్త ఆశలు కల్పించారు. గతంలో తమిళులు మనల్ని మద్రాస్‌ను నుంచి తరిమేశారు. తర్వాత తెలంగాణ వాదులు హైదరాబాద్ నుంచి గెంటేశారు. ఇకపై అలా జరగదు. తొలి ఆంధ్రపాలకులు శాతవాహనులు ఏలిన గడ్డ నుంచే మళ్లీ ఆంధ్రుల అభివృద్ధి ప్రయాణాన్ని ప్రారంభిస్తాం, పాలనను పరుగులు పెట్టిస్తాం, అని చంద్రబాబు గర్వంగా ప్రకటించారు. ఇక అమరావతికి శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ కూడా ఇది మాననవనరుల రాజధానిగా వెలుగొందుతుందన్నారు. అమరావతి 1.5 కోట్ల జనాభా అవసరాలను తీర్చేవిధంగా నిర్మిస్తామని, 2035 నాటికి 3.3 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని, 16.9 చదరపు కిలోమీటర్ల(4,170 ఎకరాలు)లో ఏర్పాటు చేయదలచిన కోర్ కేపిటల్ ప్రాంతం నాలుగు మిలియన్ల ప్రజల అవసరాలను తీరుస్తుందని, 2050 నాటికి 1.8 మిలియన్ల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పిస్తుందని అంచనా వేశారు. 16,000 గ్రామాల నుంచి తెచ్చిన మట్టి, పవిత్ర జలాలు కచ్చితంగా అమరావతి తేజస్సును మరింతగా పెంచుతామన్నారు. కలిసి నిర్మిద్దాం, కలలు సాధిద్దాం అంటూ పిలుపునిచ్చారు. అయితే ఆచరణలో మాత్రం అది ఎండమావిగానే మారింది. ఇదే సమయంలో జగన్ నేతృత్వంలో వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమరావతిని తొలగించబోమంటూనే మూడు రాజధానులు నిర్మిస్తామని ప్రకటించింది. విశాఖలో సెక్రెటేరియేట్, అమరావతిలో అసెంబ్లీ, కర్నూల్‌లో హైకోర్టు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేసింది. ఒక్క అమరావతిలోనే రాజధాని నిర్మించాలంటే రూ.5 లక్షల కోట్లు ఖర్చవుతుందని, ఆంధ్రప్రదేశ్ ఉన్న పరిస్థితుల్లో అది సాధ్యమయ్యే విషయం కాదని కూడా సీఎం హోదాలో జగన్ స్పష్టం చేశారు. అయితే, మూడు రాజధానుల నినాదం 2024 ఎన్నికల్లో మునిగిపోవడమే కాకుండా వైసీపీ ప్రభుత్వాన్ని కూడా ముంచేసింది.

## కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక!

అప్పటివరకు దారీతెన్నూ లేకుండా రూపుకోల్పోయిన అమరావతికి మరోసారి ప్రధానిమోదీ చేతులమీదుగా పునఃప్రారంభోత్సవం నిర్వహించి చంద్రబాబు రాజధాని పనులను తిరిగి మొదలుపెట్టారు. ఐకానిక్ బిల్డింగ్స్‌గా భావిస్తున్న 250 మీటర్ల ఎత్తయిన అసెంబ్లీకి, 7 అంతస్తులతో భారీస్థాయిలో నిర్మించనున్న హైకోర్టు పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే 50 అంతస్తులు, 40 అంతస్తులతో కూడిన 5 టవర్స్‌కి భూమిపూజ చేశారు. రాబోయే 100 ఏళ్ల అవసరాలను తీర్చేవిధంగా అమరావతిని తీర్చిదిద్దాలనే తలంపుతో అనేక విదేశీ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. అయితే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలను గాలికొదిలేసి, అమరావతి టార్గెట్‌గా మాత్రమే చంద్రబాబు ముందుకెళ్తున్నారనే విమర్శలున్నాయి. పైగా ఇప్పటికే ఉన్న 33 వేల ఎకరాలకు తోడు మరో 20వేల పైచిలుకు ఎకరాల భూమిని రెండో దశలో సమీకరించాలని భావించడం, అందుకోసం తాజాగా కేబినెట్‌లో తీర్మానం కూడా ఆమోదించడంతో మరోసారి అమరావతిపై విమర్శల జడివాన ప్రారంభమైంది.

## మూడు జోన్లతో విమర్శలకు ముగింపు!

రానున్న మూడేళ్ల కాలంలో రాజధాని అమరావతి కోసం రూ.లక్ష కోట్లు వెచ్చించి, దాన్ని ప్రపంచంలోనే ఓ మోడల్ సిటీగా, ఎకో ఫ్రెండ్లీగా, క్వాంటంవ్యాలీగా తీర్చిదిద్దాలనేది చంద్రబాబు భావన. అయితే, ఇప్పటికే అప్పులకుప్పగా మారిన ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి ఓ గుదిబండగా మారుతుందనేది విమర్శకుల వాదన. కానీ, తన ఆలోచనను ప్రజలకు ఓ గొప్ప విజన్‌గా చూపించడం, దాన్ని సాకారం చేయడం కోసం ఎంతవరకైనా వెళ్లడం చంద్రబాబు నైజం. ఇందులో భాగంగానే తన కలల రాజధాని అయిన అమరావతికి ఎలాంటి అడ్డంకులు రాకుండా ఉండడం కోసం, ఇతర ప్రాంతాల నాయకులు, ప్రజల్లో అసంతృప్తి రేకెత్తకుండా ఆయన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మూడు జోన్ల విధానంతో కొత్త అభివృద్ధి మంత్రాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చారు. ఇందులో భాగంగా రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం మూడు ఎకనమిక్ రీజియన్లను ఏర్పాటు చేయనున్నారు. వీటికి విశాఖ, తిరుపతి, అమరావతి కేంద్రాలుగా ఉండనున్నాయి. విశాఖ రీజియన్‌లో శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు, పార్వతీపురం మన్యం, తూర్పుగోదావరి, కాకినాడ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలు ఉండనున్నాయి. అలాగే అమరావతి రీజియన్‌లో పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చోటు కల్పించారు. తిరుపతి రీజియన్‌లో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, కర్నూల్, నంద్యాల, అన్నమయ్య, వైఎస్సార్ కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాలు ఉండనున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రాన్ని ఓ యూనిట్‌గా భావించి దీనికి ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు వ్యవహరిస్తారని, మూడు రీజియన్లకు ముగ్గురు సీనియర్ రాజకీయ నాయకులను క్యాబినెట్ హోదాలో వైస్ ఛైర్మెన్లుగా నియమించి పర్యవేక్షిస్తారని, ముగ్గురు సీనియర్ ఐఏఎస్‌లు సీఈవోలుగా వ్యవహరిస్తారని తెలుస్తోంది. తద్వారా ఇటు రాయలసీమతో పాటు ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాలకు కూడా సమ ప్రాధాన్యం లభిస్తుందని కూటమి ప్రభుత్వం అంచనా వేస్తోంది.

## బాబు ముందు మూడు లక్ష్యాలు!

ఏ పనిచేసినా జనామోదంతో పాటు స్వీయ ప్రయోజనం కూడా నెరవేర్చుకోవడమే రాజు లక్ష్యం కావాలని కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో పాలకులకు హితబోధ చేశారు. దీన్ని ఆమూలాగ్రం అవపోసన పట్టిన చంద్రబాబు ప్రస్తుతం మూడు జోన్ల విధానాన్ని కూడా ఇదే కోవలో ముందుకు తీసుకెళ్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకోసం మూడు లక్ష్యాలతో ముందుకు వెళ్తున్నాడన్నది కూడా వారి అభిప్రాయం. మూడు జోన్ల విధానంతో అమరావతికే అన్నీ అనే ముద్రను ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో తొలగించడం చంద్రబాబు మొదటి లక్ష్యం. అందరి ఆమోదంతో లోకేష్‌ని ముఖ్యమంత్రిని చేయడం ఆయన రెండవ లక్ష్యం. లోకేష్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటైతే, యువరక్తంతో మంత్రివర్గాన్ని సంస్కరించాలంటే, అడ్డుగా ఉండే సీనియర్లలో ముఖ్యులను సంతృప్తి పరచాలి. కాబట్టి మూడు జోన్లకు కేబినెట్‌హోదాతో వైస్ ఛైర్మెన్లుగా సీనియర్ నేతలని నియమించి, వారిని సంతృప్తి పరచడం, తద్వారా లోకేష్ నాయకత్వానికి అటు పార్టీ, ఇటు ప్రభుత్వంలో ఎదురులేకుండా చేయడం ఆయన మూడో లక్ష్యం. ఏదేమైనా 'లోగుట్టు పెరుమాళ్ల కెరుక' అన్నట్లుగా, మూడుజోన్ల ఏర్పాటు గుట్టు చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌కు మాత్రమే ఎరుకన్నది ఎవరూ కాదనలేని వాస్తవం..!

# జయభారత్ ఆసుపత్రికి..లక్ష విరాళం

హైదరాబాద్‌కి చెందిన బెజవాడ శ్రీకృష్ణరెడ్డి సతీమణి శుభలక్ష్మీ పుట్టినరోజు సందర్భంగా ఇటీవల నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రిలోని బెజవాడ రామచంద్రారెడ్డి కంటి విభాగానికి లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆసుపత్రి ఛైర్మెన్ పొన్నలూరు సీతారామిరెడ్డికి ఆ విరాళాన్ని పంపగా, ఆయన వైస్‌ఛైర్మెన్ బాలు సుబ్బారావుకి అందచేశారు. దాతల కోరిక మేరకు ఆ మొత్తాన్ని ఉచిత కంటి ఆపరేషన్‌ల కోసం ఉపయోగిస్తామని సీతారామిరెడ్డి తెలిపారు. దీని ద్వారా వారి జన్మదినం సందర్భంగా 50 మంది పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. గతంలో కూడా వారు కంటి విభాగానికి చేయూతనిచ్చారని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా శుభలక్ష్మికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు.



# రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

## • స్వర్ణభారత్ ట్రస్టీ దీపా వెంకట్

స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ, భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కుమార్తె దీపా వెంకట్ ఈనెల 3న నెల్లూరులోని రెడ్‌క్రాస్ సొసైటీని సందర్శించారు. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్ ఛైర్మెన్ చామర్తి జనార్ధన్‌రాజుతో కలసి ఆమె తొలుత, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలోని ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులతో ముచ్చటించారు. ప్రతి తరగతి గదిని సందర్శించి ఆ చిన్నారులకు నిర్వహించే వివిధ రకాల థెరపీలు, ప్రత్యేక విద్య గురించి అడిగి తెలుసుకున్నారు.



అనంతరం రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న తలసీమియా ప్రాజెక్ట్‌ను సందర్శించారు. నెల్లూరు రెడ్ క్రాస్‌లో వంద మందికి పైగా తలసీమియా బాధిత పిల్లలకు క్రమం తప్పకుండా పూర్తి ఉచితంగా రక్తమార్పిడి జరుగుతోందని ఈ సందర్భంగా ప్రాజెక్టు కన్వీనర్ డాక్టర్ సీత ఆమెకి తెలిపారు. తలసీమియా వ్యాధి కలిగిన చిన్నారులకు బోన్‌మ్యారో ప్లాంటేషన్ ద్వారా మాత్రమే ఆ వ్యాధి పూర్తిగా నయమవుతుందని చెప్పారు. అనంతరం దీపా వెంకట్ రెడ్ క్రాస్‌లోని బ్లడ్ సెంటర్‌ను సందర్శించి రెడ్ క్రాస్ సేవలను కొనియాడారు. రాబోయే రోజులలో రెడ్ క్రాస్‌కు తన వంతు సహాయ సహకారాలను అందిస్తామని తెలియచేశారు. రెడ్ క్రాస్ కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, కలికి శ్రీహరిరెడ్డి, యాలమూరి రంగయ్య నాయుడు, తలసీమియా సేవా సభ్యురాలు షేక్ పర్వీన్, డాక్టర్ హరిత, డాక్టర్ యశోవర్ధన్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు వద్దనే.. వద్దు!

### స్త్రీ శిశుసంక్షేమ అధికారిణి పిలుపు

నెల్లూరు జిల్లాను.. బాల్య వివాహ రహిత జిల్లాగా చేయడం మనందరి బాధ్యత అని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారిణి హేనా సుజన్ చెప్పారు. ఈనెల 4వతేదీ గురువారం ఆమె నెల్లూరు అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు ప్రాంగణంలో అంగన్‌వాడీలతో మాట్లాడుతూ, బాల్య వివాహాలు బాలల భవితను దెబ్బతీస్తాయని, బాల్యవివాహ రహిత జిల్లాగా మన జిల్లాను తీర్చిదిద్దుకుందామంటూ ఆమె అందరితో ప్రమాణం చేయించారు. మిషన్ వాత్సల్య కో-ఆర్డినేటర్ వి.అనురాధ, సీడీపీఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ ముసుగులో.. రాక్షసి మహిళలు





**స్వాతంత్ర్యోద్యమంలో తానూ భాగమై పోరాడిన పొణకా కనకమ్మ, సారా వ్యతిరేక పోరాటంలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన దూబగుంట రోశమ్మ, సాహితీ వనంలో విరబూసిన మహోన్నత సాహితీమణి, కవయిత్రి మొల్లమ్మ లాంటి ఎందరో మహిళామణులకి జన్మనిచ్చిన పుణ్యభూమి నెల్లూరు. ఆనాటి నుండి ఈనాటి వరకూ అనేక రంగాల్లో తమ ప్రతిభా ప్రావీణ్యాలని ప్రదర్శిస్తూ నెల్లూరు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేస్తున్న అనేకమంది మహిళామూర్తులకి పుట్టినిల్లుగా వర్ధిల్లుతున్న ధన్యభూమి మన నెల్లూరు.**

**అలాంటి అద్భుత చరిత్ర కలిగిన జిల్లాలో తులసివనంలో గంజాయి మొక్కల్లా అవతరించిన కొంతమంది దుర్మార్గపు మహిళలు తమ వికృత చేష్టలతో నెల్లూరుకి అపఖ్యాతిని మూటగడుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకి సారధ్యం వహిస్తూ నెల్లూరు పేరుని మంటగలుపుతున్నారు. రాజకీయ ముసుగులో రాక్షస చర్యలకి తెగిస్తూ.. హత్యలకి సైతం పాల్పడుతున్నారు.**

**మొన్నటికి మొన్న వార్తలలోకి వచ్చిన నిడిగుంట అరుణ అకృత్యాలు ఒక్కొక్కటిగా బయటపడుతూ దర్యాప్తు కొనసాగుతుండగానే, అతి కిరాతకంగా ఓ సామాజిక కార్యకర్త నిండు ప్రాణం తీసిన ఆరవ కామాక్షి ఘాతుకం వెలుగులోకి వచ్చింది. ఈ ఇద్దరి మహిళల నేర చరిత్ర రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారి నెల్లూరుకి మాయని మచ్చ తెచ్చింది.**

## నిడిగుంట అరుణ నేపథ్యం పరిశీలిస్తే..!



హత్యా నేరంపై జైలుశిక్ష అనుభవిస్తున్న శ్రీకాంత్ అనే కిరాయి హంతకుడితో అరుణ వ్యక్తిగత సాన్నిహిత్య సంబంధం పెట్టుకుంది. శ్రీకాంత్‌ని తాను పెళ్లాడబోతున్నానంటూ ప్రచారం చేసుకుంది. శ్రీకాంత్‌ని బూచిగా చూపిస్తూ మధ్యస్తాలకి, బెదిరింపులకి, బ్లాక్‌మెయిలింగులకి, అక్రమ సంపాదనకి పాల్పడింది. శ్రీకాంత్‌ని పెరోల్‌పై బయటకి తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలతో పాటు కొంతమంది రాజకీయ నాయకులని కూడా ఇరకాటంలో పెట్టింది. అరుణ పైరవీలు, పైశాచికాలు మీడియాలో రావడంతో పోలీసులు కూపీ లాగారు. డొంక కదిలింది. పుంఖాను పుంఖాలుగా అరుణ అకృత్యాలు బయటకి పొక్కాయి. ప్రస్తుతం అరుణ కటకటాలలో ఊచలు లెక్కబెడుతోంది.

## అరవ కామాక్షి కథలోకి వెళ్తే...!



అరవ కామాక్షిది మరో కోణం. నేర సామ్రాజ్యంలో కామాక్షి ప్రత్యక్ష పాత్ర పోషించింది. తన నివాసాన్ని వేదికగా చేసుకుని గంజాయి వ్యాపారానికి తెరలేపింది. స్కూళ్ళని, కాలేజీలని, కేఫ్‌లని, నగరంలోని కొన్ని ముఖ్యకూడళ్లని తన వ్యాపార అడ్డాలుగా మార్చుకుని గంజాయి విక్రయాలకి నాంది పలికింది. పాత చిత్తు కాగితాలని ఏరుకునే అనాధ పిల్లలని తన గంజాయి వ్యాపారానికి పావులుగా వాడుకుంది. కరడుగట్టిన కిరాయిమూక (పాత నేరస్తులు, రౌడీ షీటర్లు)ని ఎంపిక చేసుకుని తనకి అండగా ఉండేలా వారిని చేరదీసింది. తన సొంత తమ్ముడు జేమ్స్‌ని కూడా వాళ్ళతో జత కలిపింది. అంతా 20ఏళ్ళ లోపు వయసున్న వాళ్ళే. వాళ్ళ అండతో నగర శివార్లలో కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు సమీపంలో తాను నివసించే ఆర్‌డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) కాలనీ నుంచి మొత్తం కథ నడిపించింది.

ఈ క్రమంలో అదే కాలనీలో నివాసం వుండే యువ సామాజిక కార్యకర్త, ప్రజా నాట్యమండలి సభ్యుడు కామ్రేడ్ కే. పెంచలయ్య కామాక్షి ఆగడాలని పరోక్షంగా అడ్డుకున్నాడు. ఆర్‌డీటీ కాలనీవాసులని చైతన్యవంతుల్ని చేయడంలో కీలకపాత్ర పోషించాడు. విద్య వల్ల కలిగే ప్రయోజనాలని గురించి విస్తృత ప్రచారం చేశాడు. తమ కళ్ళ ముందు జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలని అడ్డుకోమని కాలనీ వాసులకి పిలుపునిచ్చాడు. ఈ నేపథ్యంలో సామాజిక స్పృహ వున్న కాలనీవాసులు కొందరిని తనకి తోడుగా చేసుకుని ఓ బృందంగా ఏర్పడి అరవ కామాక్షి చేస్తున్న అక్రమాలని సైతం నిలదీశాడు. పోలీసులకి సైతం కామాక్షి కార్యకలాపాలపై ఉప్పందించాడు. అంతే, కామాక్షికి కోపం కట్టలు తెంచుకుంది, అమెలోని రాక్షసత్వం పడగ విప్పింది. పెంచలయ్య అడ్డు తొలిగించుకోవాలని నిర్ణయించుకుంది. వెంటనే తన తమ్ముడితో పాటు ఆమె వద్ద వున్న కిరాయి మూకకి ఆ పని అప్పజెప్పింది. నవంబర్ 28వతేదీ శుక్రవారం సాయంత్రం తన కుమారుడిని స్కూలు నుండి తీసుకు వస్తున్న పెంచలయ్యను కామాక్షి తమ్ముడు జేమ్స్‌తో కలసి ఆ కిరాయి ముఠా సభ్యులు అడ్డగించారు. తమ ద్విచక్ర వాహనాలతో పెంచలయ్య స్కూటర్‌ని ఢీకొట్టి పెంచలయ్యని పడేశారు. ఆయన కింద పడిపోయిన వెంటనే వేటకొడవళ్లతో అతి పైశాచికంగా ఆయనపై దాడిచేసి చంపేశారు. పెంచలయ్య పదేళ్ళ కుమారుడు నిఖిల్ కళ్ళముందే ఆ బాలుడి నాన్నని క్రూరంగా నరికేశారు.

## పోలీసులపై సైతం తిరగబడ్డారు..!

పెంచలయ్యని హతమార్చిన దుండుగులు సాలు చింతల సమీపంలోని పాడుబడిన చక్కెర ఫ్యాక్టరీలో ఉన్నారన్న సమాచారంతో నవంబర్ 29వతేదీ శనివారం తెల్లవారుఝామున పోలీసు బృందం వారిని పట్టుకునే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో కామాక్షి తమ్ముడు జేమ్స్ పోలీసులపై తిరగబడ్డాడు. ఆది నారాయణ అనే కానిస్టేబుల్‌ని కత్తితో గాయపరిచాడు. పరిస్థితి చేయి జారిపోతుందని భావించిన పోలీసులు జేమ్స్‌పై కాల్పులు జరిపారు. అతడి కాలికి గాయం కావడంతో అదుపులోకి తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కత్తి వేటుకి గురైన కానిస్టేబుల్ ఆదినారాయణని కూడా ఆసుపత్రిలో చేర్పించారు. పెంచలయ్య హత్యకి సంబంధించి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కారణమైన 17 మందిని గుర్తించామని పోలీసులు తెలిపారు. వారిలో కామాక్షి కాకుండా 12 మందిని అరెస్టు చేశామన్నారు. కామాక్షిపై పీడీ యాక్టు పెట్టినట్లు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జేమ్స్‌ని అరెస్టు చేయవలసి ఉండగా, తప్పించుకుని తిరుగుతున్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకి ఎవరు పాల్పడినా చర్యలు కఠినంగా వుంటాయని హెచ్చరించారు. అలా సంకేతాలు ఇస్తూ 45మంది రౌడీషీటర్లని వీఆర్సీ కూడలి నుండి గాంధీ బొమ్మ వరకు రోడ్డులో నడిపించారు.

## రాజకీయ రొచ్చు...!

అటు నిడిగుంట అరుణ, ఇటు ఆరవ కామాక్షి ఇద్దరూ రాజకీయ నేతలతో సంబంధాలు వున్నవాళ్ళే. అయితే, తమ ఆగడాలకు రాజకీయ పలుకుబడి కూడా అవసరం కాబట్టి వీళ్ళు ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీ నాయకుల చెంతకి చేరడం సర్వ సాధారణం. ప్రస్తుత రాజకీయాలలో ఇలాంటి నేపథ్యం వున్న వాళ్ళు అన్ని పార్టీలలోనూ వున్నారు. పట్టుబడనంత వరకూ అందరికీ అందరూ మంచివాళ్ళే. ఒక్కసారి వాళ్ళ గుట్టు రట్టయ్యాక ఎవరూ వీళ్ళు తమ వాళ్ళు అని వెనుకేసుకుని రారు. తమ మద్దత్తు ఇవ్వరు. ఇక ఇలాంటి అసాంఘిక నేరస్తులు అందరి నాయకుల వద్దకీ వెళ్ళి ఫోటోలు తీసుకుంటుంటారు. అంత మాత్రాన వీళ్ళు పలానా పార్టీ వాళ్లకి చెందిన వారు అని ధ్రువీకరించడం అసాధ్యం. ఈ పనికిమాలిన వాళ్ళ కోసం రాజకీయ నాయకులు పరస్పరం విమర్శించుకోవడం రాజకీయ రొచ్చు తప్పితే వారి ఆరోపణల వల్ల ఎవరికీ లాభం ఉండదు. ప్రజలకి అన్నీ తెలుసు. జనం అమాయకులనుకుంటే అది రాజకీయ నాయకుల భ్రమే.

## నెల్లూరు పరువు తీస్తున్నారు...!

ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు వున్న నెల్లూరులో ఇలాంటి నేరాలు-ఘోరాలు జరగడం బాధాకరం. ఇలాంటి చిల్లర వ్యవహారాలతో నెల్లూరు పరువుపోతోంది. ముఖ్యంగా ఇటువంటి దుర్మార్గపు కార్యకలాపాలలో మహిళలు పాల్గొనడం సిగ్గు చేటైన విషయం. భవిష్యత్తులో పెంచలయ్య హత్య లాంటి ఘోర సంఘటనలు జరగకుండా చూసుకోవలసిన బాధ్యత రాజకీయ నాయకులతో పాటు ప్రజలపైన కూడా వుంది. పోలీసు శాఖ సైతం మాటలకి, ప్రకటనలకి పరిమితం కాకుండా ఇటువంటి వారిని ఉక్కుపాదంతో అణిచేయాలి. అతి ప్రశాంతమైన నెల్లూరులో అశాంతి వాతావరణాన్ని సృష్టిస్తున్న వారిని గుర్తించి ఏరి పారేయాలి...!



లాయర్
డిసెంబర్ 05, 2025

# ఆంధ్రాని వణికిస్తున్న.. మాయదారి పురుగు!

గతంలో కంటికి కనిపించని సూక్ష్మక్రిమి ద్వారా కరోనా వచ్చి జనం లక్షల సంఖ్యలో మృత్యువాత పడిన నేపథ్యంలో, ఇప్పుడు ఏ వింత జబ్బు వచ్చినా ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొత్త జబ్బుల పేరు వింటేనే హడలిపోతున్నారు. అయినా కలికాలం కాకపోతే, ఏ విషపు పామో కాటేస్తే ప్రాణాలు పోతాయనుకుంటాం కానీ, ఏదో ఒక చిన్న పురుగు కుట్టినా చచ్చిపోయేంత ప్రమాదం ఏమిటి?..అంటూ జనం విస్తుపోయే దుస్థితి కూడా వచ్చేసింది. అవును!.. కంటికి కనిపించే నల్లి లాంటి ఒక చిన్న నల్లటి పురుగు ఇప్పుడు ఆంధ్రాని గడగడ లాడిస్తోందంటే అతిశయోక్తి కాదు. చీమలాగానో, దోమ లాగానో గబుక్కున కుట్టి, దానిపాటికది మెల్లిగా వెళ్లిపోతుంది. దీని దెబ్బకి ఓ మహిళ ప్రాణాలు కోల్పోవడమే కాక, మరెంతో మంది దీని బారినపడి మంచం పట్టడం ఏపీలో ఒక పెద్ద సంచలనంగా మారింది.

వాస్తవానికి..అదొక చిన్న మట్టిపురుగే.. కానీ, అదే పెద్ద ప్రమాదం తెస్తోంది. అది కుడితే చాలు.. శరీరమంతా నల్లని దద్దుర్లు వస్తాయి. అదేముంది తగ్గిపోతాయిలే అనుకుంటే పొరపాటే. ఆ పురుగు కాటు వల్ల వారం పది రోజులకల్లా జ్వరం వస్తుంది. అది అంత సులభంగా తగ్గే జ్వరం కాదు. 100 నుంచి 104 డిగ్రీల దాకా పోతుంది. దాంతో పాటు విపరీతమైన తలనొప్పి, వాంతులు, వొళ్ళు నొప్పులు, అలసట వంటివి వస్తాయి. అవి కూడా మామూలే కదా..పోతాయిలే.. తగ్గుతాయిలే అని నిర్లక్ష్యం చేశామో..చివరికి రక్తంలో ప్లేట్‌లెట్స్ పడిపోయి.. కోమాలోకి పోయేలా చేసి.. ప్రాణాలమీదకి వస్తుం దంటున్నారు వైద్యనిపుణులు. అది కుట్టినచోటే కాదు, శరీరం లోని అన్ని అవయవాల మీద దాని ప్రభావం బాగా ఉంటుం దట. ఆ పురుగు కుట్టడం ద్వారా వచ్చే ఈ ప్రమాదకరమైన వ్యాధినే.. 'స్క్రబ్ టైఫస్' అంటున్నారు. గతంలో ఇది తమిళనాడు, ఢిల్లీ ప్రాంతాల్లో వచ్చిందని చెప్తున్నారు. ఇప్పుడిది ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు అన్ని జిల్లాలకు వ్యాపిస్తుండడంతో ప్రజలు మరింత కలవరపడుతున్నారు. దీనిని నిర్లక్ష్యం చేస్తే మాత్రం శ్వాసకోశ వ్యాధులో, లేకపోతే కిడ్నీలు లేదా మరే అవయవాలైనా దెబ్బతినడమో జరిగే అవకాశం కూడా ఉం దంటున్నారు. అయితే, వెంటనే చికిత్స చేసుకుంటే మాత్రం ఈ ప్రమాదం నుంచి గట్టెక్కవచ్చునని, భయపడాల్సిన అవసరం ఏమీ లేదని కూడా చెప్తున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, తగు చికిత్సలు చేసుకుంటే త్వర గానే ఇది నయమవుతుందని వైద్యులు భరోసా ఇస్తున్నారు. ఇది అంటువ్యాధి కాదని, ఒకరి నుంచి మరొకరికి కూడా రాదని స్పష్టం చేస్తున్నారు.

తాజాగా మొన్నటికి మొన్న విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఇటీవల ఓ మహిళ ఈ వింత వ్యాధితో మరణించడం, ఆ తర్వాత నుంచి రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో ఈ వ్యాధికి సంబంధించిన కేసులు వస్తుండడంతో రాష్ట్రంలో ఇదో పెద్ద కలకలంగా తయారైంది. ఇప్పటికే రాష్ట్రంలో దాదాపు 1300కి పైగానే కేసులు వచ్చాయని అంచనా. అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 379 కేసులు నమోదయ్యాయి. కాకినాడలో 142, విశాఖలో 123, కడపలో 94, నెల్లూరులో 86, అనంతపురంలో 68, తిరుపతిలో 64, విజయనగరంలో 59, కర్నూలులో 42, అనకాపల్లిలో 41, శ్రీకాకుళంలో 34, అన్నమయ్యజిల్లాలో 32, గుంటూరులో 31, నంద్యాలలో 30.. ఇలా పలు ప్రాంతాల్లో ఈ కేసులు రావడంతో ఆందోళన పెరుగుతోంది. ఏళ్ల తరబడిగా వాడుతున్న మంచాలు, దిండ్లు, దివాన్లు, పాతబడిపోయిన బొంతల్లో ఇలాంటి కీటకాలు చేరతాయని, కనుక ఎప్పటికప్పుడు వాటిని శుభ్రం చేసుకుంటుండాలని వారి సలహా. అంతేకాదు, ముఖ్యంగా తోటలు, పొలాల్లో ఉన్న మట్టిలోనూ, వ్యర్థాలు కుప్పలుగా ఉన్న చోట్ల ఈ పురుగులు ఎక్కువగా ఉంటాయి కనుక, పొలాల్లో పనులు చేసుకునే రైతులు తదితరులు ఈ పురుగుల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ కీటక బాధలనుంచి ప్రజలను రక్షించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలి. ప్రాణాలకే ముప్పు తెచ్చే ఇలాంటి కీటక వ్యాధుల గురించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాల్సి ఉంది. ముఖ్యంగా, వ్యాధి లక్షణాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం చేసి అవగాహన కలిగించడం, వైద్యఆరోగ్యశాఖ వారు గ్రామ గ్రామానా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, ఒకవేళ ఎవరైనా ఈ స్క్రబ్ టైఫస్ వ్యాధితో బాధపడుతుంటే వెంటనే తగు చికిత్సలు చేయించడం ఎంతైనా అవసరం!

# చంద్రబాబుకి మరో దారిలేదు!

"మంచితరుణం మించిపోనీకు" అని ఓ సినిమా కవి రాసిన మాటలని అక్షరాలా ఆచరించడంలో ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఘటికులు. ప్రతికూల పరిస్థితులని కూడా తనకి అనుకూలంగా మార్చుకోగల రాజకీయ చాణుక్యుడు చంద్ర బాబు. తాను అధికారంలో వున్న ఈ అయిదేళ్ల కాలంలోనే లోకేష్‌ని తన వారసుడిగా ప్రకటించి పాలనాపగ్గాలని అప్పగిస్తారని గత వారం మన 'లాయర్'లో రాశారు. 2027 ఉగాదిని అందుకు ముహూర్తంగా నిర్ణయించారన్న సమా చారం కూడా అందించారు. మీరు రాసింది ఖచ్చితంగా జరుగుతుందన్నది నా అభిప్రాయం. కేంద్రంలో చక్రం తిప్పుతున్న మోడీ, అమిత్ షా ద్వయం కూడా చంద్ర బాబు కంటే లోకేష్ వైపు మొగ్గుచూపే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. ఒకవేళ 2029 వరకూ చంద్రబాబు నాయకత్వమే కొనసాగితే కమలనాథుల చూపు జగన్ మోహన్‌రెడ్డి వైపు మళ్ళే అవకాశం కూడా లేకపోలేదు. అలాంటి పరిస్థితిని రానీయ కుండా అడ్డుకోగలగడంలో దిట్ట చంద్ర బాబు. రాజకీయ పరిస్థితులని, ప్రజల నాడిని ముందుగానే అంచనా వేయడంలో బాబుని మించినవారు లేరు. మొన్నటి ఎన్ని కలలో కూటమిగా ఏర్పడడమే అందుకు ఉదాహరణ. పవన్ కళ్యాణ్ బీజేపీ మాట జవదాటి వెళ్ళే పరిస్థితి లేదు. కాబట్టి 2029లో మళ్ళీ కూటమిగానే ఎన్నికలకి వెళ్ళడానికే బాబు మొగ్గు చూపుతారు. అందుకు అవసరమైతే లోకేష్‌ని ముందే ముఖ్యమంత్రిగా చేయడం తప్ప బాబుకి మరో దారిలేదు.

*యం. చంద్రమౌళి,* **కొత్తఢిల్లీ.**

# గూడూరు ప్రజలు తిరగబడాలి!

జిల్లాల పునర్విభజన కసరత్తులో కూటమి ప్రభుత్వం గూడూరుని తిరుపతి జిల్లా నుండి మార్చి మళ్ళీ నెల్లూరుజిల్లాలో చేరుస్తుందన్న గూడూరు వాసుల ఆశలు అడియాస లయ్యాయి. ఎన్నికల వేళ వాగ్దానం చేసిన చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ మాట తప్పారు. ఈ విషయంపై గూడూరు పౌరులు తిరగబడాలి. వారి నిరసన నినాదాలు రాజధాని వరకూ చేరేలా గర్జించాలి. జనంలో ఉద్యమ స్ఫూర్తి రగిలించేలా అన్ని రాజకీయపార్టీలు ప్రజలని చైతన్యవంతం చేయాలి. గత ప్రభుత్వం గూడూరుని తిరుపతి జిల్లాలో చేర్చి నప్పుడు, అదే ప్రభుత్వంలో భాగస్వామిగా వుంటూ నోరు విప్పని మాజీ శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఈసారి గట్టిగా స్పందించడం సంతోషకరం. ఆయన ప్రకటించినట్లుగా ఆమరణదీక్ష చేస్తే గూడూరు పరిసర ప్రాంత ప్రజలు హర్షిస్తారు. ఆయనకి మద్దతుగా నిలుస్తారు.

*- డి.హరిత,* **గూడూరు.**

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# బస్సుల్లో సీట్లు దొరకడం లేదు!

కూటమి ప్రభుత్వ ఉచిత ప్రయాణ పథకం పుణ్యమా అని జిల్లాలో మహిళలు జోరుగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు కళకళలాడుతున్నాయి. నిండు గర్భిణీలా ప్రయాణం సాగిస్తున్నాయి. జిల్లా లోని మారుమూల పల్లెల నుండి సైతం మహిళలు షాపింగుల కోసం, షికార్ల కోసం నెల్లూరు నగరానికి తరలివస్తున్నారు. చిన్న పాటి అనారోగ్యాలకి కూడా నెల్లూరు డాక్టర్ల వద్దకి పరిగెత్తుతున్నారు. అనేక పనుల మీద నెల్లూరుకు వచ్చే మగాళ్ళకి బస్సులలో సీట్లు దొరకడం లేదు. తెలంగాణ తరహాలో మన రాష్ట్రంలో కూడా ప్రవేశపెట్టిన మహిళల ఉచిత ప్రయాణ పథకం ఆర్టీసీకి లాభాలు తెచ్చిపెట్టకపోయినా, బాబుగారి ప్రభుత్వానికి మాత్రం మహిళల దీవెనలు తెచ్చిపెడుతోంది.

*షేక్ మహమ్మద్ బాషా,* **ఉదయగిరి.**

సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 119

# కుదేలవుతున్న క్రీడారంగం!

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు తమ దేశ యువతకి క్రీడారంగంపై ఆసక్తిని కల్పించి వారిని ప్రోత్సహిస్తున్నాయి. ప్రపంచస్థాయిలో వాళ్ళు తమ ప్రతిభని ప్రదర్శించి పతకాలు సాధిస్తున్నారు. తమ దేశాలు గర్వపడేలా రాణిస్తున్నారు. మనదేశంలో కూడా ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులకి కొదవలేదు. గ్రామీణ స్థాయి నుండి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పోటీపడే క్రీడాకారులు మనకి దండిగానే ఉన్నారు. అయితే, క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పించే విషయంలో మాత్రం మన పాలకులు, ప్రభుత్వాలు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నది జగమెరిగిన సత్యం. ఆటగాళ్ళకి అవసరమైన విశాల మైదానాలు, పూర్తిస్థాయి క్రీడా పరికరాలు కలిగిన స్టేడియంలు మన జనాభాకి తగ్గట్లుగా అందుబాటులో లేకపోవడం క్రీడారంగానికి పెద్ద లోపంగా క్రీడాకారులకి తీరని శాపంగా మారింది. మన దేశంలో చాలాకాలంగా ఇదే పరిస్థితి. ప్రపంచంలోని ఇతర దేశాల్లో క్రీడాకారులకు అధునాతనమైన విధానాలతో, శిక్షణ ఇస్తున్నారు. వివిధ ఆటలలో వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారు. పతకాల వేటలో వాళ్ళు అగ్రభాగాన ఉండేలా ప్రోత్సహిస్తున్నారు. మనదేశంలో క్రీడాకారులకు మెరుగైన శిక్షణలు ఇచ్చేవారు. కానీ, ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించే నాథులు గానీ లేకపోవడంతో ఆశించిన స్థాయిలో మన ఆటగాళ్ళు రాణించలేకపోతు న్నారు. క్రీడారంగాన్ని అభివృద్ధి చేసే క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రకాల పథకాలు అమలుచేస్తున్నా, క్షేత్రస్థాయిలో వాటిని ఆచరణలో పెట్టడంలో విఫలమవుతున్నాయి. దేశవ్యాప్తంగా క్రీడల అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'ఖేలో భారత్' అనే పేరుతో 'జాతీయ క్రీడా విధానం' కార్యక్రమాన్ని ప్రారంభించినా అది ఇంకా బాలారిష్టాల నుంచి బయటపడడం లేదు.

## పాఠశాలల్లో నామమాత్రంగానే క్రీడా వసతులు :

బాలబాలికలకి చిన్నతనం నుండే ఆటల పట్ల ఆసక్తి కల్పించాలి. వారికి ప్రావీణ్యం వున్న ఆటలలో రాణించేలా తర్ఫీదు ఇవ్వాలి. భారతదేశంలో అటు ప్రైవేటు రంగం లోనూ ఇటు ప్రభుత్వ పరంగానూ లక్షలాది పాఠశాలలు ఉన్నాయి. కానీ, వాటిల్లో సగానికిపైగా స్కూళ్ళలో ఆట స్థలాలు ఉండడం లేదు. ముఖ్యంగా అధిక శాతం ప్రైవేటు స్కూళ్ళు నగరాల నడిబొడ్డులో కాంక్రీట్ జంగిళ్ళ మధ్యలో ఉంటున్నాయి. ఇరుకు భవనాలలో కేవలం విద్యాబోధనకే ప్రాధాన్యత ఇస్తున్నాయి. వాస్తవానికి విద్యాబోధన కోసం సబ్జక్టులు వున్నట్లే క్రీడల కోసం పీ.టీ(ఫిజికల్ ట్రైనింగ్) పిరియడ్ కూడా ఉండాలి. పాత రోజుల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చివరి పిరియడ్‌గా పీ.టీ. తప్పనిసరిగా ఉండేది. ప్రతి పాఠశాలలోనూ ఒక పీ.ఈ.టీ (ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్) ఖచ్చితంగా ఉండేవారు. తమ విద్యార్థినీవిద్యార్థులలోని ప్రతిభని వాళ్ళు గుర్తించేవారు. వారిలో ఉత్సాహాన్ని నింపేవారు. గ్రామస్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకూ జరిగే ఆటల పోటీలలో వాళ్ళు పాల్గొనేలా వాళ్ళలో స్ఫూర్తిని కలిగించే వారు. పాఠశాలల యాజమాన్యాల తీరు కూడా మారాలి. తమ సంస్థలో చదివే బాలబాలికలలోని టాలెంటుని వాళ్ళు గుర్తించాలి. వాళ్ళకి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి. బాలురతో సమానంగా బాలికలు కూడా ప్రపంచస్థాయి పోటీల్లో తమ సత్తా చాటుకుంటూనే వారిని తీర్చిదిద్దాలి. క్రికెట్, కబడ్డీ, వెయిట్ లిఫ్టింగ్, పరుగు పందెం, జావెలిన్ త్రో, టెన్నిస్‌తో పాటు ఇంకా పలు క్రీడల్లో ఇటీవల మన మహిళలు ప్రపంచ స్థాయిలో రాణిస్తూ దేశానికి ఎనలేని కీర్తిని తెచ్చిపెడుతున్నారు. ప్రోత్సాహం అందిస్తే బాలికలు సైతం ఎంతటి విజయాలైనా సాధిస్తారనడానికి ఇంతకంటే ఉదాహరణలు అవసరం లేదు. ఇంతలా తమ సత్తా చాటుతున్నప్పటికీ దేశంలోని చాలా ప్రాంతాల్లో బాలికలకి క్రీడల్లో అంతగా ప్రాముఖ్యత ఉండడం లేదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా మార్కులు, ర్యాంకుల మీదనే దృష్టి పెడుతున్నారు తప్ప, క్రీడల్లో అమ్మాయిలని పెద్దగా ప్రోత్సహించడం లేదు. ఒక విధంగా గతంతో పోలిస్తే ఇప్పుడు పరిస్థితి కొంతమేరకు మెరుగుపడింది. ఇంకా చాలా మార్పు అవసరం.

## నత్తనడకలో క్రీడా వికాస కేంద్రాలు :

నియోజకవర్గాల స్థాయిలో క్రీడా వికాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెప్తూనే ఉన్నారు తప్ప, వాటి నిర్మాణాలు ఇంకా నత్తనడకలోనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సైతం క్రీడా వికాస కేంద్రాల నిర్మాణాలు కొన్నిచోట్ల అర్ధాంతరంగానే నిలచిపోయి ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో అసలు వాటి నిర్మాణాలే ప్రారంభం కాలేదు. కొత్తగా మినీ స్టేడియంలు, ఇండోర్ స్టేడియంలు నిర్మించి, క్రీడాకారులకు క్రీడావసతులను అందుబాటులో తేగలిగితే పురోగతి దానంతటదే వస్తుంది.

## రాజకీయ పెత్తనం ఉండకూడదు!

రాజకీయ నాయకుల ఆధిపత్యం, క్రీడాకారుల ఎంపికలో వారి ప్రాభవం వంటివి మన క్రీడారంగానికి పట్టిన జాడ్యాలు. దేశానికి ప్రతిష్టను చేకూర్చే క్రీడా సంస్థల్లో రాజకీయ జోక్యం అంతకంతకీ పెరిగిపోవడం విచారకం. ప్రతిభావంతులైన క్రీడాకారు లను నిర్లక్ష్యం చేసి, అయినవారినీ, పరపతి పలుకుబడి ఉన్నవారిని జట్లల్లో చేర్చుకుం టున్నారనే విమర్శలు క్రీడాసంస్థలు, సంఘాలపై తరచూ వినిపిస్తూనే ఉంటాయి. ఇప్పటికైనా ఆ ఆధిపత్య పోకడ మానాలి. ప్రోత్సహించాల్సినవారే నిరుత్సాహపరుస్తున్నా రనే అపవాదు పోవాలి. ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టి అలాంటి పెడసరపు ధోరణులను కనిపెట్టి అరికట్టాలి. తమలో అపార ప్రతిభ ఉన్నా ఆర్థిక స్థోమత సరిపోక రాణించలేని వారు కోకొల్లలుగా ఉంటారు. అలాంటి వారిని గుర్తించి వారికి తగిన సహాయం అందించి క్రీడల్లో వారిని ప్రోత్సహించాలి. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ నిజమైన క్రీడాకారులను తయారుచేయగలిగితే, గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయికి, అక్కడి నుంచి అంతర్జాతీయస్థాయికి వెళ్ళి తమ సత్తా ఏమిటో చూపించగలిగే దమ్మున్న క్రీడాకారులు మారుమూల గ్రామాల్లో సైతం చాలామంది ఉన్నారు. అలాంటివారిని కనిపెట్టి, వారిని మరింత మెరికలుగా తీర్చిదిద్దాలి. జిల్లాస్థాయి నుండి జాతీయస్థాయి వరకూ బడ్జెట్‌లో క్రీడా రంగానికి పుష్కలంగా నిధులు కేటాయించాలి. ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయగలిగితే, విశ్వక్రీడల్లోనూ అద్భుత విజయాలు మన భారత్ సొంతమవుతాయి. ప్రతిష్టాత్మక పతకాలు మన ఖాతాలో పడతాయి!

**- రాజశ్రీ**

## సంక్షేమ పథకాల అమలులో..
# మనదే రికార్డు!

## ● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ రికార్డులు సృష్టిస్తోందని, అందుకు భారీమొత్తాలు వ్యయమవుతున్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన పాలనాను భవంతో ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ముత్తుకూరు మండలంలోని తాళ్లపూడి పంచాయతీ కప్పలదొరువు, మల్లూరు గ్రామాలలో ఆయన ఇటీవల లబ్ధిదారు లకు పింఛన్లు అందజేశారు.

**ప్రతి పంచాయతీలో మినరల్ వాటర్ ప్లాంట్ :**

ప్రతి పంచాయతీలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటే లక్ష్యంగా పనిచేస్తున్నామని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఆయన మనుబోలు పడమరవీధి ఎస్టీ కాలనీతో పాటు అక్కంపేటలో మెట్టు రవీంద్రరెడ్డి ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. పేదలకు ఉపయోగపడేలా ఆర్వో ప్లాంట్లు అందు బాటులోకి తెస్తున్న రవీంద్రరెడ్డిని ఆయన అభినందించారు. ఎస్‌ఇఎల్ కంపెనీ కూడా ఒక్కొక్కదానికి రూ. 36 లక్షలు వెచ్చించి 14 ప్లాంట్లు ఏర్పాటు చేసిందని, రూ. 7 లక్షల చొప్పున ఖర్చు చేస్తూ మరో 33 ప్లాంట్లు ఏర్పాటు చేస్తోందని కూడా ఆయన తెలిపారు.



## ఇన్ఫోసిస్‌కి ఎంపికైన
# ఎన్‌బికెఆర్ విద్యార్థినులు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ ఇంజనీరింగ్ కళాశా లలో బీటెక్ ఆఖరిసంవత్సరం చదువుతున్న విద్యార్థినులు 40 మంది ఇటీవల ఇన్ఫోసిస్ కంపెనీ ఉద్యోగాలకి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ మరియు ఇన్ఫోసిస్ భాగస్వా మ్యంతో నవంబరు 13 నుంచి 16వ తేదీ వరకు జరిగిన ప్రాంగణ ఎంపికల్లో తమ ప్రతిభని నిరూపించుకున్నారు. ఈ కళా శాల నుండి మొత్తం 265మంది విద్యార్థి నులు ఆ పరీక్షలకు హాజరయ్యారని, ఆన్‌లైన్‌లో వీరికి రాతపరీక్ష నిర్వహించగా, అందులో 52 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించి, అందులో 40 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల సంచాలకులు డా. వి. విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు వార్షిక వేతనం రూ. 3.6 లక్షల వరకు ఉంటుందని ఆయన చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డా. ఎన్. కిషోర్, ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసులు అభినందించారు.

## గంజాయి బ్యాచ్‌ల..
# భరతం పట్టండి!

## ● పోలీసులకు ఆదేశాలిచ్చిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కోవూరు నియోజకవర్గంలో 'గంజాయి' అన్న పదమే వినపడకూడదని, గంజాయి బ్యాచ్‌ల భరతం పట్టాలని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పోలీసులకు ఆదేశాలిచ్చారు. నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని తమ నివాసంలో ఆమె నియోజకవర్గ పరిధిలోని కోవూరు, బుచ్చి, కొడవలూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. యువత జీవితాలను ఛిద్రం చేస్తున్న గంజాయి విక్రయాలు, సేవనంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైతే డ్రోన్స్ ద్వారా గంజాయి బ్యాచ్‌ల కదలికలు పసికట్టా లన్నారు. పాఠశాలల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

### 'చికెన్ వ్యర్థాలతో చేపల సాగు'ను అరికట్టండి

చికెన్ వ్యర్థాలతో చేపల సాగు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఈ సందర్భంగా పోలీసులను కోరారు. చికెన్ వ్యర్థాలతో చేపలను సాగు చేయడం వల్ల, ఆ చేపలను తినే ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. భూగర్భజలాలు కూడా కలుషితమవుతున్నాయని, పర్యావరణ సమతుల్యతకు భంగం కలుగుతుందని తెలిపారు. గ్రామస్థాయిలో వీటిపై దృష్టిపెట్టాలని, చికెన్ వ్యర్థాలతో చేపల సాగు చేసేవారిని గుర్తించి గ్రామపెద్దల ద్వారా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు.

# రైతన్నలకు అండగా నిలుస్తాం

**ఎమ్మెల్యే కాకర్ల**

ఆరుగాలం కష్టించి పనిచేసే రైతన్నలకు తాము, తమ ప్రభుత్వం అండగా నిలుస్తామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చెప్పారు. ఇటీవల ఆయన కలిగిరి మండలం నాగిరెడ్డి పాలెం గ్రామంలో 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో పాల్గొని, రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల ఇళ్ల వద్దకు వెళ్ళి ప్రభుత్వం వారికి అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిం చారు. ప్రత్యేకంగా, అన్నదాత సుఖీభవ పథకం కింద రెండో విడతగా 7 వేల రూపాయల ఆర్థిక సహాయం రైతుల ఖాతాలలో జమయ్యిందా? లేదా? అని రైతులను అడిగారు. అందుకు రైతులు స్పందిస్తూ తమకు అన్నదాత సుఖీభవ నగదు సమయానికి అందిందని సంతోషంగా చెప్పారు. పంట సాగు కోసం అవసర




మైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ ఖర్చులకు ఆ సాయం ఎంతో ఉపయోగపడిందని వారు తెలిపారు.

# పొదలకూరులో.. రగ్బీ పోటీలు

మండల కేంద్రమైన పొదలకూరులో ఇటీవల రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. బాలుర విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జట్లు అందరి అభినందనలు అందుకున్నాయి. అదేవిధంగా, బాలికల విభాగంలో విజేతగా తూర్పు గోదావరి, రన్నర్స్‌గా గుంటూరు, మూడో స్థానంలో నెల్లూరు జట్లు నిలిచాయి. విజేతలైన జట్లను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అభినం దించి, 30వేల రూపాయలను బహుమతిగా అందజేశారు. విద్యార్థులు క్రీడలతో పాటు చదువులోనూ రాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన చెప్పారు.

# గణేష్‌ఘాట్, నెక్లెస్‌రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు

## ● నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య



నెల్లూరు చెరువు గట్టు వద్ద ఉన్న ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డు, గణేష్ ఘాట్‌లను 2.5 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలంటూ నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డు, గణేష్ ఘాట్‌ను ఆయన ఇటీవల టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలసి పరిశీలించారు. మొదటి దశలో 2.5 కోట్ల రూపాయలతో ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డు, గణేష్ ఘాట్‌లో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణం, ముఖద్వారాల నిర్మాణం, పార్క్ అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్‌ను అభివృద్ధి చేస్తామని కోటంరెడ్డి శీనయ్య చెప్పారు. నెల్లూరు నగర ప్రజలకు ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్, గణేష్ ఘాట్‌ను ఆహ్లాదకరమైన ప్రాంతంగా అన్ని విధాల అభివృద్ధి చేస్తామని గిరిధర్‌రెడ్డి తెలిపారు.

## 'ఉపాధి' పథకంలో..
# స్వాహారాయుళ్ళు!

## చనిపోయినవారి పేర్లతోనూ జాబ్‌కార్డులు

నిరుపేదలు, కష్టజీవులకు ఉపాధి కల్పించాలనే సదాశయంతో కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న ఉపాధి పథకం నెల్లూరుజిల్లాలో స్వాహారాయుళ్లకు ఆహారపథకంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం పూర్తిస్థాయిలో దుర్వినియోగమైనట్లు ఇప్పటి అధికారులు గుర్తిస్తున్నారు. ఆ పథకాన్ని అమలుచేసే అధికారులు, సిబ్బందే అప్పట్లో దీనికి గండికొట్టి, అందినంత మేరకు మేసేయడం తెలిసిందే. కేంద్రప్రభుత్వం తాజాగా ఈ అవినీతి మాఫియాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో, అవినీతి జలగలు అప్పట్లో ఎలా ఈ పథకాన్ని స్వాహా చేశాయో వెల్లడవుతున్నాయి. ఉపాధి పనులు చేసే పేదలకు ఇచ్చే జాబ్‌కార్డుల కేటాయింపులో భారీ స్థాయిలో అవకతవకలు జరిగినట్లు జిల్లా ఉన్నతాధికారులు గుర్తించారు. అడిగేవారు, అడ్డుకునేవారు లేకపోయేసరికి ఎవరిష్ట ప్రకారం వారు ఈ పథకాన్ని తమ స్వాహాపథకంగా మార్చుకున్నారు. పెద్దమొత్తాల్లోనే పేదల డబ్బుని జవురుకున్నారు. ఇప్పటికే 28వేలకి పైగా జాబ్‌కార్డులు అనర్హమైనవిగా తేలిందంటే.. ఈ పథకాన్ని అప్పటి అధికారులు, సిబ్బంది కలసి ఎంతగా తినేశారో తేటతెల్లమవుతుంది. అంతేకాదు, ఈ కార్డుల్లో ఎప్పుడో చనిపోయిన వారి పేర్లు కూడా ఉన్నాయి. అవి కూడా వేలసంఖ్యలో ఉండడంతో ఉన్నతాధికారులే విస్తుపోతున్నారు. సుమారు 18వేలకి పైగానే చనిపోయిన వారి పేర్లతో ఆ కార్డులు జారీ చేసినట్లు తెలుసుకున్నారు. ఉపాధి పనులు చేసేవారు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని నిబంధనలు రావడంతో అక్రమార్కులకు గొంతులో వెలక్కాయ పడ్డట్లయింది. ఇటీవల ఒక్క అల్లూరు మండలంలోనే 102 మంది ఈకేవైసీ (ఉపాధి పనుల వివరాల నమోదుకు) చేయించుకోవడానికి రాకపోవడంతో ఈ గుట్టు రట్టయింది. ఆ 102 మందిలో 101 మంది ఎప్పుడో చనిపోయి ఉన్నట్లు తెలియడంతో జిల్లా ఉన్నతాధికారులకు నోటమాట రావడం లేదు. అంతగా ఉపాధి పథకం మేతగాళ్లకు హారతి కర్పూరమైపోవడం చూస్తే, నెల్లూరుజిల్లాలో కేంద్రప్రభుత్వ పథకాల అమలు ఎంత దిగనాసిగా జరుగుతున్నాయో అర్థమవుతుంది. కేంద్రప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఈ స్వాహాలపై మరింత లోతుగా విచారణలు చేపడితే ఇంకెన్ని బండారాలు బయటపడతాయో మరి!..

# రామాభ్యుదయం.. విశిష్ట గ్రంథం

అష్టదిగ్గజ కవుల్లో ఒకరైన అయ్యలరాజు రామభద్రుడు రచించిన 'రామాభ్యుదయం' గ్రంథం తెలుగు ప్రబంధాల్లో ఆణిముత్యం వంటిదని శతావధాని డా. తాతా సందీప్‌శర్మ (హైదరాబాద్) చెప్పారు. చెన్నై-టీనగర్‌లోని కృష్ణాహాల్-ఆంధ్రా క్లబ్‌లో 'వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో, నవంబరు 30న 'రామాభ్యుదయ కావ్య సౌందర్యం' అనే అంశంపై జరిగిన ఉప న్యాసంలో ఆయన ప్రసంగించారు. 'రామాభ్యుదయం'లోని ప్రతి పద్యం తెలుగు భాష మాధుర్యానికి ప్రతీకగా ఉండడం ఈ గ్రంథంలోని విశిష్టత అని ఆయన తెలిపారు. అనంతరం, వేద



విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు, పలువురు తెలుగు ప్రముఖులు డా. సందీప్‌శర్మను సన్మానించారు.

## పెంచలయ్య కుటుంబానికి అండగా
# కోటంరెడ్డి.. 10 లక్షల సాయం



గంజాయి రౌడీల చేతిలో మరణించిన పెంచలయ్య కుటుంబాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈనెల 3న సీపీఎం నాయకులతో కలిసి పరామర్శించారు. ఆ కుటుంబానికి సాయంగా 10 లక్షల రూపాయలను అందజేసి ఆదుకున్నారు.ఆ కుటుంబానికి తాము సొంతంగా, రూరల్ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఆ మొత్తాన్ని అందజేస్తున్నామని చెప్పారు. పెంచలయ్య కుమారుల చదువుల బాధ్యతలను తమ కుమార్తెలు కోటంరెడ్డి హైందవి, వైష్ణవి తీసుకుంటారని చెప్పారు. ఆర్డీటీ కాలనీవాసులు భయపడాల్సిన అవసరం లేదని, మీకు అండగా నేనుంటానని శ్రీధర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పెంచలయ్య సాగించిన గంజాయి వ్యతిరేక పోరాటానికి కలిసొచ్చే అన్ని పార్టీలతో కలిసి ఆ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఆర్డీటీ కాలనీలో మరిన్ని వసతుల కల్పన కోసం వారం రోజుల్లోనే మరో 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయిస్తామని కూడా ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. పెంచలయ్య చేసిన గంజాయి వ్యతిరేక పోరాటం భావితరాలకు స్ఫూర్తినిస్తుందని అంటూ, పెంచలయ్య విగ్రహాన్ని కాలనీలో ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పెంచలయ్యను హతమార్చిన హంతకులకు కఠినశిక్షలు పడే విధంగా ప్రయత్నిస్తామన్నారు. గంజాయి నిర్మూలనకి నెల్లూరుజిల్లా పోలీసు యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు.

**సీపీఎం నేత మాదాల ధన్యవాదాలు :**

పెంచలయ్య కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఈ సందర్భంగా సీపీఎం నేత, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పెంచలయ్య బిడ్డల చదువులకు ఎమ్మెల్యే సాయం అందిస్తామన్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# నవల - నానీల రచయితలకు అవార్డులు



నెల్లూరులోని ఐఎంఏహాలులో డాక్టర్ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి నవలా అవార్డు, మరియు జమున స్మారక నానీల సంపుటి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నవంబరు 30న జరిగింది. ప్రముఖ నవలా రచయిత కేవీ మేఘనాథ్‌రెడ్డికి, నానీల రచయిత కంచనపల్లి రవికాంత్‌కి జయప్రద సోమిరెడ్డి దంపతులు అవార్డులతో పాటు నగదు బహుమతులు ఇచ్చి సత్కారం అందజేశారు. ఈ సందర్భంగా పెళ్లకూరు జయప్రద రచించిన 'మెడికల్ కథలు', అవ్వారు శ్రీధరబాబు రచించిన నానీల సంపుటిలను ఆవిష్కరించారు. ప్రముఖ బాలసాహితీవేత్త.కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా. గంగిశెట్టి శివకుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కవులు బైనా దేవదాసు, కొండ్రెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎం.వి.రామిరెడ్డి, సుంకర గోపాల్, ఇంద్రగంటి మధుసూదన్‌రావు, అవ్వారు శ్రీధరబాబు, గోవిందరాజుల సుభద్రాదేవి, తోట సులోచన పాల్గొన్నారు.






# నెల్లూరు కబుర్లు

# మేయర్‌కి పదవీ గండం!

అందరూ అనుకుంటున్నట్లు నెల్లూరు నగర మేయర్ పదవికి గండం ఏర్పడింది. మేయర్ పొట్లూరి స్రవంతిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సమావేశం కూడా పెడుతున్నారు. ముహూర్తం ఈనెల 18వ తేదీ ఉదయం 11.30 గంటలకు. ఆమేరకు సమావేశం ఏర్పాటుకు కలెక్టర్ ఈనెల 2న ఉత్తర్వులు కూడా ఇచ్చారు. మొత్తం 54మంది కార్పొరేటర్లలో అత్యధికంగా ఉన్న టీడీపీ వాళ్ళు అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైనట్లు వినికిడి. టీడీపీదే బలం కావడం, వైసిపికి కొద్దిమంది కార్పొరేటర్లే ఉండడంతో మేయర్‌ని పదవి నుంచి దించడం వారికి సులభమే కావచ్చు. అయితే, కొత్త మేయర్ ఎవరన్నది మాత్రం ఇంకా తేలలేదు. కానీ, అదే ఎస్టీ సామాజికవర్గానికి చెందిన దేవరకొండ సుజాతకి మేయర్‌గా అదృష్టం కలిసొచ్చే సూచనలు కనిపిస్తున్నాయంటున్నారు.

# మహనీయుడు.. మాగుంట సుబ్బరామిరెడ్డి!

• స్మరించుకున్న నాయకులు



ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఈనెల 1న నెల్లూరులో పొగతోటలోని ఎం-1 థియేటర్‌లో జరిగిన మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మాగుంట సేవలను ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు. సీనియర్ నాయకులు సీవీ శేషారెడ్డి మాట్లాడుతూ, మాగుంట సుబ్బరామిరెడ్డికి ఒంగోలు-నెల్లూరు రెండు కళ్ళులాంటివని, ఎంపీగా ఉన్న సమయంలో వాటి అభివృద్ధికి ఎంతో కృషిచేశారన్నారు. ఆయన ప్రజలకి చేసిన సేవలు ఏనాటికీ మరచిపోలేమన్నారు. నెల్లూరు నగరంలో మినీ బైపాస్ నిర్మించడంలో అప్పటి కేంద్రమంత్రితో చర్చించి మినీ బైపాస్ ఏర్పాటుకు ఆయన కృషిచేశారని గుర్తుచేశారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, స్వర్ణవెంకయ్య, బాలసుధాకర్, ఏసునాయుడు, రఘురాం ముదిరాజ్, మాగుంట కుటుంబసభ్యులు మాగుంట మమతమ్మ, మాగుంట సుబ్బరామ్, వరిదిరెడ్డి రవీందర్‌రెడ్డి, వి.ఎం.వి సుబ్బారావు, ఎల్లా విజయభాస్కర్‌రెడ్డి, కే.విజయభాస్కర్‌రెడ్డి, ప్రమిదల శ్రీనివాసులు, మాగుంట సుబ్బరామిరెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

## 'కూటమి' వచ్చాకనే..
# నెల్లూరు నేరమయం

• ఎమ్మెల్సీ పర్వతరెడ్డి విమర్శ



గతంలో నెల్లూరు నగరం మంచి నగరంగా.. నిజాయితీకి, మంచి మనుషులకి ప్రతీకగా ఉండేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక మాదకద్రవ్యాలకు, నేరాలకు నిలయంగా మారిపోయిందని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఇటీవల ఆయన నెల్లూరు రాంజీనగర్‌లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో.. విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గంజాయి విపరీతంగా పెరిగి, నెల్లూరు గంజాయికి అడ్డాగా తయారైందని విమర్శించారు. సమాజంలో శాంతిభద్రతలు క్షీణించి, యువత పెడ ద్రోవ పడుతున్నారని, పోలీసు ఇంటెలిజెన్స్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై.. నెల్లూరు నేరాలకు కేంద్రంగా మారిందని దుయ్యబట్టారు. అనంతరం స్థానిక వైయస్ ఆర్సీపీ నేతలతో కలిసి.. 'సేవ్ ది నెల్లూరు' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. గంజాయి మహమ్మారి నుంచి నెల్లూరును కాపాడాలంటూ నినాదాలు చేశారు.

# పేదల సంజీవని..సీఎం సహాయనిధి



నిరుపేదల పాలిట సంజీవనిగా ముఖ్యమంత్రి సహాయనిధి తోడ్పడుతుందని, పేదలకి ఇదొక వరమని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో, నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని 24మంది పేదలకు 16 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి, చెక్కులు అందజేసిన గిరిధర్‌రెడ్డికి లబ్ధిదారులు తమ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## సుప్రసిద్ధ సాహితీవేత్త చిన్ని నారాయణరావుకి..
# 'మాడభూషి' సాహితీ పురస్కారం!



నెల్లూరుకు చెందిన సుప్రసిద్ధ సాహితీవేత్త చిన్ని నారాయణరావుకి విశిష్టమైన 'మాడభూషి' సాహిత్య పురస్కారం లభించింది. వెంకటాచలంలోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నవంబరు 28న ఆ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో నారాయణరావు ఆ పురస్కారాన్ని అందుకున్నారు. కవితారంగంలో ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. ఆ కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు చేతుల మీదుగా తాను ఆ సాహితీ పురస్కారాన్ని అందుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా చిన్ని నారాయణరావు తెలిపారు. ప్రముఖ బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్, ప్రముఖ కవయిత్రి పాతూరి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# పెంచలయ్య హంతకులను శిక్షించాలి

**- జనసేన ప్రధాన కార్యదర్శి గునుకుల**



భావితరాల వారి భవిష్యత్తు కోసం.. గంజాయికి, మత్తుపదార్థాలకి వ్యతిరేకంగా పోరాడుతున్న సీపీఎం నాయకుడు, కళాకారుడు పెంచలయ్యని గంజాయి ముఠావాళ్లు హత మార్చడం దారుణమని, ప్రభుత్వం ఆ హంతకులను కఠినంగా శిక్షించాలని జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కోరారు. పెంచలయ్య తన మరణానంతరం కూడా నలుగురికి వెలుగునిచ్చేందుకు నేత్రదానం చేసిన సమాజ సేవకుడని, అలాంటి వ్యక్తిని కిరాతకంగా చంపడం ఘోరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన తరఫున కూటమి ప్రభుత్వం పెంచలయ్య కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ల్యాబ్ టెక్నీషియన్ల..కొత్త కార్యవర్గం

ప్రభుత్వ ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఈనెల 1న నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బీవీ రాజేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా సీహెచ్ రత్నం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్‌డీ రసూల్‌సాహెబ్, కోశాధికారిగా మహమ్మద్ షఫీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్కె మీరామొహిద్దీన్, మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి ఎస్. శాంతి ఎన్నికయ్యారు. పరిశీలకులుగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, ఎన్నికల అధికారిగా వీఎన్‌వీఆర్ కిషోర్, సహాయాధికారిగా లక్ష్మీ సుభద్ర వ్యవహరించారు.

## 150 కోట్లతో..

# రాష్ట్రంలో కాలువల పూడికతీత

**• మంత్రి నారాయణ వెల్లడి**



రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో రూ.150 కోట్లతో కాలువల పూడికతీత పనులు చేపట్టామని రాష్ట్ర పురపాలక మంత్రి డా. పొంగూరు నారాయణ చెప్పారు. దిత్వ తుఫాన్ హెచ్చరికలు ఉన్నప్పటికీ ఆయన ఇటీవల నెల్లూరులో సుడిగాలి పర్యటన చేశారు. పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తమ పార్టీ నాయకుల దృష్టికి తీసుకుని వస్తే తక్షణమే సాయం అందజేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. తొలుత, 13వ డివిజన్ ప్రణతి అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న సైడ్ కాలువలను మంత్రి పరిశీలించారు.. పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 8వ డివిజన్ రేబాలవారి వీధిలోని పార్కుల ఆధునీకరణ పనులను పరిశీలించారు. పార్కులో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్, జిమ్‌లను పర్యవేక్షించి పలు మార్పులు చెయ్యాలని చెప్పారు.. అయితే అక్కడ చేరుకున్న స్థానికులు అభ్యర్థన మేరకు పార్కు సమీపంలో సైడ్ డ్రైన్ ఏర్పాటుకు మంత్రి ఆమోదం తెలిపారు. ఆ తర్వాత, ఆత్మకూరు బస్టాండ్ అండర్ పాస్ వద్ద రోడ్డు పనులను పరిశీలించారు. సిరి థియేటర్ వద్ద జరుగుతున్న కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, డ్రైన్లలో పూడికతీయటం వల్ల నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిలవదన్నారు. ఈ పనులన్నీ పూర్తయితే నెల్లూరుకు ముంపు సమస్య తీరిపోతుందని చెప్పారు.

### జోరు వానలోనూ పెన్షన్‌లు

జోరువాన కురుస్తున్నా లెక్కచేయకుండా, నెల్లూరు నగరంలోని 11 డివిజన్లో మంత్రి నారాయణ ఈనెల 1న పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రంలో ఒకేరోజులో 90 శాతం పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఘనత ఒక్క కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

# ప్రళయం వచ్చినా సరే..

# పింఛన్ల పంపిణీ ఆగదు

**మంత్రి ఆనం భరోసా**



పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఇచ్చిన మాటకు కట్టుబడి కోట్లాది రూపాయలను ఖర్చుచేస్తూ ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ప్రతినెలా 1వ తేదీన 'పేదల సేవలో ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం సంగం మండలం గాంధీజనసంఘం గిరిజనకాలనీలో జోరువాన కురుస్తున్నా వెనుకడుగు వేయకుండా ఆయన పేదలకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంత పెద్ద తుఫాను వచ్చినా, ప్రళయం వచ్చినా సరే 1వ తేదీన పింఛన్లు ప్రతి ఇంట్లో ఇచ్చి తీరాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని ఆయన స్థానికులకు వివరించారు.

### పేదలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి...



రాష్ట్రంలో నిరుపేదల అత్యవసర వైద్యచికిత్సలకు అవసరమైన నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారంగా మంజూరు చేస్తున్నారని మంత్రి ఆనం చెప్పారు. ఈనెల 2న ఆయన ఆత్మకూరు ఆర్అండ్‌బి అతిథిగృహంలో 28 పేదకుటుంబాలకు రూ.35.21 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

### ఆత్మకూరులో వేగంగా.. అభివృద్ధి పనులు

ఆత్మకూరు నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు మంజూరైనట్లు మంత్రి ఆనం తెలిపారు. సంగం మండలంలోని గాంధీజనసంఘం గ్రామంలో రాష్ట్రీయ గ్రామస్వరాజ్ పథకం ద్వారా పంచాయతీ భవన నిర్మాణాలకు రూ.32 లక్షలను కేంద్రప్రభుత్వం మంజూరు చేసిందని, నియోజకవర్గంలో రూ.15కోట్లతో ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు నిర్మించేలా నిధులు మంజూరు చేశామన్నారు.

# ప్రతి శుక్రవారం.. 'ప్రజాదర్బార్'

**రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి**



ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించేందుకు కోటంరెడ్డి సోదరులు సంకల్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రజాదర్బార్‌ను ఏర్పాటు చేయనున్నామని వారు తెలిపారు. ప్రతి శుక్రవారం నగరంలోని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరులు.. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రకటించారు. ఇటీవల వారు నెల్లూరులోని తమ కార్యాలయంలో మాట్లాడుతూ, తాము ఇప్పటికే ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని చెప్పారు. మాజీమేయర్ నందిమండలం భానుశ్రీ, జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, గంగాధర్ పాల్గొన్నారు.

### పెన్షన్ల పంపిణీ :

ఈనెల 1న 28వ డివిజన్ కేశవులనగర్‌లో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి లబ్ధిదారులకు పెన్షన్‌లు పంపిణీ చేశారు. పెన్షన్‌దారుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. వర్షంలో సైతం తమ ఇంటికి వచ్చి పెన్షన్ అందచేసిన శ్రీధర్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీసిటీలో వైభవంగా.. భాగవత సప్తాహం



శ్రీసిటీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన భాగవత సప్తాహ మహోత్సవం నవంబరు 29న వేడుకగా ముగిసింది. శ్రీసిటీ–శ్రీవాణి సౌజన్యంతో భాగవత భక్త సమాజ బృందం ఈ నెల 23న ఆలయ ఆవరణలో భాగవత సప్తాహ కార్యక్రమం ప్రారంభించారు. 25మంది బృంద సభ్యులు వారం రోజుల పాటు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు 12 స్కంధాలతో కూడిన 335 అధ్యాయాలు, 18 వేల భాగవత శ్లోకాలను పఠనం గావించి ప్రత్యేక పూజలతో కార్యక్రమం పూర్తిచేశారు. ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జన చేసే క్రమంలో భాగవత వైశిష్ట్యాన్ని వివరిస్తూ రాష్ట్రమంతటా ప్రతి నెలా భక్తులు కోరిన చోట ఈ భాగవత భక్త సమాజ బృందం వారు భాగవత సప్తాహాన్ని నిర్వహిస్తుండడం విశేషం. ఇప్పటి వరకు 421 సప్తాహాలు పూర్తిచేయగా, శ్రీసిటీలో 422వ కార్యక్రమం నిర్వహించినట్లు బృంద సభ్యులు తెలిపారు. అన్ని వసతులు సమకూర్చి తమకు ఈ అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చివరిరోజు కార్యక్రమంలో పాల్గొని, భాగవత భక్త సమాజ బృందానికి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం, భాగవత భక్త సమాజ సభ్యులను శాలువాలతో సత్కరించి, స్వామివారి తీర్థ, అన్న ప్రసాదాలను అందచేశారు. శ్రీసిటీ ప్రతినిధులు పి.ఎస్.బి.శాస్త్రి, పల్లేటి బాలాజీ తదితరులు పర్యవేక్షించారు.

# వైద్య విద్యార్థుల ఆత్మహత్యలపై ఆరా!

నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాలలో రెండు నెలల్లోనే ఇద్దరు మెడికోలు ఆత్మహత్యలకు పాల్పడడంపై ఈనెల 2న మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్ ఆరా తీశారు. రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్‌గౌర్‌ల సూచనలతో ఆయన కళాశాలకు వచ్చి, ఆత్మహత్యల సంఘటనల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్య విద్యార్థుల్లో మానసిక, ఆర్థిక పరిస్థితులను పరిశీలించారు. ఎవరూ వత్తిడులకు, కుంగుబాటుకు లోనుకాకుండా బాగా చదువుకునేందుకు, విద్యార్థుల్లో ఆమేరకు పరివర్తన కలిగేందుకు 12 మంది విద్యార్థులకు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ వంతున కమిటీని ఏర్పాటుచేశారు. విద్యార్థుల పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని తగు విధంగా స్పందించేందుకు వీలుగా వారు నివేదికలు ఇవ్వాలని సూచించారు.

# ఐటీడీఏ పీఓగా..సుజాత

జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిణిగా పనిచేస్తున్న కె.సుజాతను ప్రభుత్వం నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా నియమిస్తూ, పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. దాంతో ఆమె ఈనెల 1న ఐటీడీఏ పీఓగా బాధ్యతలు స్వీకరించారు ఈ స్థానంలో పనిచేస్తున్న మల్లికార్జునరెడ్డి, సీఆర్‌డీఏకి డిప్యుటేషన్‌పై బదిలీ అయి వెళ్ళారు.

# దర్గామిట్ట జడ్పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు దర్గామిట్టలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులు గౌతమ్ కుమార్, ధిల్లీబాబు, మెహరీన్‌లు నెట్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయి పోటీలకు అర్హత సంపాదించారు. నాందేడ్‌లో జనవరిలో జరిగే జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో వారు పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీవీ కృష్ణారెడ్డి తెలిపారు.




# 'దిత్వా' తుఫాన్‌తో..
# కుండపోత వానలు



దిత్వా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో గత నాలుగైదు రోజులుగా భారీ వానలు కురుస్తున్నాయి. చెరువులు, దొరువులు, జలాశయాలన్నీ నిండిపోయాయి. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో విస్తారంగా కురిసిన వర్షాలతో జనజీవనం స్తంభించింది. ముఖ్యంగా కావలి, దగదర్తి, అల్లూరు, బోగోలు, జలదంకి తదితర తీరప్రాంత మండలాల్లో కుండపోత వానలు కురిశాయి. చాలా చోట్ల నారుమళ్లు మునిగిపోయాయి. రైతులు నష్టాలకి గురవుతున్నా.. అవి వాళ్లకి ఎప్పుడూఉండే కష్టాలే కదా, ఎన్నని తీరుస్తాం అన్నట్లుగా అధికారులు నిమ్మళంగానే ఉంటున్నారు. ఏం చేద్దాం!.. పీత కష్టాలు పీతవి!. రైతు బాధలు రైతువి!..

### నగరం నరకమే మరి!..

డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఎంతోకాలంగా నెల్లూరు నగరం నరకంగానే ఉంటోంది. వానలొచ్చాయంటే నగర రోడ్ల పరిస్థితి ఇక చెప్పాల్సిన అవసరమే లేదు. ద్విత్వా వానలతో నెల్లూరు నగరం తడిసి ముద్దయింది. రోడ్లు కాలువలు కావడం, సైడు కాలువలు పొంగిపోయి రోడ్లమీదకి నీళ్ళు రావడం, కొన్నిచోట్ల ఇళ్ళలోకి కూడా నీళ్ల వచ్చి చేరడం వంటివి షరా మామూలే. అండర్‌బ్రిడ్జి వద్ద నీటిప్రవాహం చేరడంతో బుధవారం నాడు మాగుంట లేఅవుట్‌కి రాకపోకలు గంటల తరబడి నిలిచిపోయాయి. భారీ వానలొచ్చినప్పుడలా ఈ బ్రిడ్జి కింద నీళ్ళు చేరి వాహనాల రాకపోకలు నిలచిపోవడం కూడా మామూలే. ఈ దుస్థితి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, బ్రిడ్జి కింద నీళ్లు మడుగులు కట్టకుండా ఎప్పటికప్పుడు తొలగించేందుకు ఏర్పాటుచేయాలని, శాశ్వత ప్రాతిపదికపై చర్యలు తీసుకోవాలని ఎంతోకాలం నుంచి స్థానికులు కోరుతున్నా, నాయకులు - అధికారులు సరేనంటారు కానీ, పట్టించుకుంటే గదా!...

# 'రెప్పవాలని రాత్రి' ఆవిష్కరణ



ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వెంకటాచలంలోని ఆ కేంద్రం ప్రాంగణంలో ఇటీవల జరిగిన సభలో కేంద్రం డైరెక్టర్ ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ రచించిన ' రెప్పవాలని రాత్రి' కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.అల్లం శ్రీనివాసులు ఆ కవితా సంపుటిని ఆవిష్కరించి, అందులోని విశిష్టతలను తెలియజేశారు. డాక్టర్ మాలకొండయ్య ఆ పుస్తకాన్ని సమీక్షించారు. అనంతరం, తెలుగుభాష గొప్పదనం గురించి కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత గంగిశెట్టి శివకుమార్ వివరించారు. నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.సుజ శ్యామిలీ, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

# మహోన్నత గ్రంథం..భగవద్గీత



భగవద్గీత మానవాళికి ఆ భగవంతుడు ప్రసాదించిన మహనీయ గ్రంథమని, భగవద్గీత ఒక జ్ఞాన సరస్వతి అని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి అన్నారు. ఈనెల1న గీతాజయంతి సందర్భంగా అల్లూరులో ఉన్న శ్రీకృష్ణ గీతామందిరంలో ఆయన భగవద్గీత వైశిష్ట్యాన్ని గురించి వివరించారు. మానవుడు ధర్మబద్ధంగా తన జీవన విధానాన్ని కొనసాగించేందుకు అవసరమైన విలువలను బోధించిన పవిత్ర గ్రంథం భగవద్గీత అని తెలిపారు. భగవద్గీత శ్లోకాలను, వాటి అర్థాలు-పరమార్థాన్ని భక్తులకు విశదీకరించారు. అనంతరం నిర్వాహకులు రాధాకృష్ణమూర్తిని సన్మానించారు. గీతా మందిరం నిర్వాహకులు నాగభూషణం పర్యవేక్షణలో, ఆదిలక్ష్మి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో బడబాగ్ని ఆంజనేయరాజు, సుకన్య పాల్గొన్నారు.

# వాతావరణ మార్పుల బహుముఖ దాడి




భారత ఉపఖండం ఒక బహుముఖ వాతావరణ సంక్షోభంలో చిక్కుకుంది. కేవలం ఈ వారంలో శ్రీలంకను అతలాకుతలం చేసి, దక్షిణ భారత తీరాలను కలవరపెట్టిన 'తుఫాను దిత్వా' మాత్రమే కాదు, హిమాలయాల శిఖరాల నుండి మైదానాల వరకు వాతావరణ మార్పుల ప్రభావం విస్తృతంగా ఉంది. ఒక వైపు పెరిగే సముద్ర ఉష్ణోగ్రతలు తుఫానుల స్వభావాన్ని మార్చేస్తుంటే, మరోవైపు గ్లేసియర్లు వేగంగా కరిగిపోతున్నాయి. ఈ మొత్తం ప్రక్రియలో ప్రకృతి సహజ రక్షణ కవచమైన అడవులు క్షీణించడం, సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. ఈ 3 అంశాలు ఒకదానికొకటి ఎలా ముడిపడి ఉన్నాయో విశ్లేషిస్తే, భారతదేశంపై వాతావరణ మార్పుల దాడి ఎంత విస్తృతమైనదో స్పష్టమవుతుంది.

### అనూహ్య తుఫానులు - తీరప్రాంత విధ్వంసం

గతంలో తుఫానుల తీవ్రత, అవి పయనించే మార్గం గురించి ఒక నిర్దిష్ట అంచనా ఉండేది. కానీ ఇప్పుడు, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడంవల్ల, వాతావరణ శాస్త్రవేత్తలు సైతం అంచనా వేయలేని విధంగా తుఫానులు తమ స్వభావాన్ని మార్చుకుంటున్నాయి. 'తుఫాను దిత్వా' లాంటి విపత్తులు కేవలం 48గంటల వ్యవధిలోనే అత్యంత తీవ్రరూపం దాల్చడం దీనికి నిదర్శనం. ఆంధ్ర ప్రదేశ్‌ను కలవరపెట్టిన మొంథా తుపాను కూడా శాస్త్రవేత్తల అంచనాలను తారుమారు చేసి తన గమనాన్ని, తీవ్రతను మార్చుకుని ఆంధ్రా తీరంపై కాకుండా తెలంగాణపై విధ్వంసం సృష్టించింది. తెలంగాణలో నివారణ చర్యలకు తగినంత సమయం లేకపోయింది. ఈ వేగవంతమైన మార్పులు - ముందస్తు హెచ్చరికలు, రక్షణ చర్యలు చేపట్టే సమయాన్ని తగ్గించేస్తున్నాయి. అందుకే శ్రీలంకలో మరణాల సంఖ్య, ఆస్తి నష్టం పెరిగింది. ఈ అనూహ్య పరిణామం దక్షిణ భారతదేశానికి కూడా వర్తిస్తుంది. 2025లో బంగాళాఖాతంలో ఏర్పడిన 'తుఫాను మొంథా', అరేబియా సముద్రంలో సంభవించిన 'తుఫాను బిమల్' రెండూ ఈ అనూహ్య తీవ్రతను ప్రదర్శించాయి. పాత తుఫానులతో పోలిస్తే, ఇవి కేవలం గాలి వేగం ద్వారా మాత్రమే కాక, అధిక వర్షపాతం ద్వారా ఎక్కువ నష్టాన్ని కలిగిస్తున్నాయి. వేడెక్కిన వాతావరణం అధిక తేమను నిలుపుకోగలగడం వల్ల, తుఫానులతో పాటు వర్షపాతం తీవ్రత పెరిగి చెన్నై వంటి తీర నగరాల్లో వరదలు అనివార్యమవుతున్నాయి. ఈ తుఫానుల స్వభావంలో వచ్చిన మార్పు, మన తీరప్రాంత మౌలిక సదుపాయాల బలాన్ని, విపత్తు నిర్వహణ ప్రణాళికల సమర్థతను సవాల్ చేస్తున్నాయి.

### హిమాలయాలలో కరుగుతున్న మంచినీటి వనరులు

తుఫానుల కంటే నిశ్శబ్దంగా, మరింత ప్రమాదకరంగా జరుగుతున్న మరో మార్పు-హిమాలయ హిమనీ నదాలు(గ్లేసియర్స్) కరిగిపోవడం. 'ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్' వంటి సంస్థలు, ఇతర నివేదికల ప్రకారం, హిమాలయాల గ్లేసియర్లు ప్రపంచంలోని ఇతర ప్రాంతాల కంటే వేగంగా కరిగిపోతున్నాయి. భూతాపం ఫలితంగా పెరుగుతున్న వీటి కరుగుదల ఆందోళన కలిగిస్తోంది. ఈ గ్లేసియర్లు గంగా, యమునా, సింధు వంటి జీవనదులకు ప్రధాన మంచినీటి వనరులు. ప్రస్తుతానికి, ఈ ద్రవీకరణ వేసవిలో నదులలో నీటి ప్రవాహాన్ని పెంచి, హిమనీ నది ఆకస్మిక వరదలకు దారి తీయవచ్చు. ఇది ఉత్తరా ఖండ్ వంటి కొండ ప్రాంతాల్లో విధ్వంసానికి కారణమవుతుంది. ఇటీవల కాలంలో అవి సంభవించాయి కూడా. దీర్ఘకాలికంగా చూస్తే, ఈ మంచు నిల్వలు పూర్తిగా కరిగిపోతే, భారత ఉపఖండంలో లక్షలమంది ప్రజలకు మంచినీటి కొరత, విద్యుత్ ఉత్పత్తి (జల విద్యుత్), వ్యవసాయ ఉత్పాదకతపై తీవ్రమైన, కోలుకోలేని ప్రభావం పడుతుంది. ఈ సంక్షోభం మన జల భద్రతకు అతిపెద్ద దీర్ఘకాలిక ముప్పు అవుతుంది.

### అటవీ సంపద క్షీణత - ఉష్ణోగ్రతల పెరుగుదల

వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు అడవులు మనకున్న అతిపెద్ద సహజ రక్షణ కవచం. అయితే, భారత రాష్ట్ర అటవీ నివేదిక వంటి అధికృత గణాంకాలు మొత్తం అటవీ విస్తీర్ణం స్వల్పంగా పెరిగినట్లు చూపించినప్పటికీ, అధిక సాంద్రత కలిగిన, నాణ్యమైన అడవుల విస్తీర్ణం తగ్గుముఖం పట్టడం ఆందోళనకరం. అడవులు గాలిలోని కార్బన్ డయాక్సైడుని పీల్చుకుని, గ్రీన్‌హౌస్ వాయువుల ప్రభావాన్ని తగ్గిస్తాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అటవీ విస్తీర్ణం తగ్గడంవల్ల కార్బన్ సింక్ సామర్థ్యం తగ్గి, వాతావరణంలో కార్బన్ డైఆక్సైడ్ స్థాయిలు పెరిగి, తుఫానులకు శక్తినిచ్చే భూతాపానికి పరోక్షంగా దోహదపడతాయి. అంతేకాక, అడవులు లేకపోతే స్థానిక వర్షపాత సరళి దెబ్బతింటుంది. నేల కోత పెరుగుతుంది. ఆకస్మిక వరద నష్టం తీవ్రమవుతుంది. తీర ప్రాంతాల్లోని మడ అడవులు, సరుగు చెట్ల అడవులు తుఫానుల వేగాన్ని తగ్గించి, తీరాన్ని రక్షించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఈ సహజ కవచాలు దెబ్బతింటే, 'దిత్వా' లాంటి తుఫానుల నష్టం అనేక రెట్లు పెరుగుతుంది. అటవీ నష్టం అనేది ఉష్ణోగ్రతల పెరుగుదలకు దారి తీయడమే కాకుండా, మన పర్యావరణ వ్యవస్థ యొక్క సహజ స్వభావాన్ని దెబ్బతీస్తుంది.

### తక్షణ సమన్వయ వ్యూహం అవసరం

భారతదేశం ఎదుర్కొంటున్న వాతావరణ సవాళ్లు అన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల అడవులు క్షీణించి, అది గ్లేసియర్లను కరిగించి, సముద్రాన్ని వేడి చేసి, తుఫానులను తీవ్రతరం చేస్తోంది. ఈ ప్రమాదాల నుంచి బయటపడాలంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పౌరులు అందరూ సమన్వయంతో కూడిన వ్యూహాన్ని అమలు చేయాలి. పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంచడం, తీరప్రాంత మౌలిక సదుపాయాలను వాతావరణ మార్పులకు అనుగుణంగా బలోపేతం చేయడం, అధిక సాంద్రత గల అడవుల విస్తీర్ణాన్ని పెంచడం ద్వారా మాత్రమే ఈ బహుముఖ వాతావరణ దాడిని సమర్థవంతంగా ఎదుర్కోగలం. లేదంటే, రాబోయే తరాలకు మనం ఒక అస్థిరమైన, ప్రమాదకరమైన ప్రపంచాన్ని వారసత్వంగా ఇవ్వాల్సి వస్తుంది.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్




## పెంచలయ్య హత్యకు నిరసనగా..
# జిల్లా బంద్.. జయప్రదం

సీపీఎం నాయకుడు, ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్య ఇటీవల గంజాయి ముఠా చేతిలో హత్యకు గురైనందుకు నిరసనలు వ్యక్తం చేస్తూ, సీపీఎం, వామపక్షాల వారు ఈనెల 2న చేపట్టిన జిల్లా బంద్ విజయవంతమైంది. గంజాయి, మాదకద్రవ్యాలు, ఇతర మత్తుపదార్థాలు ప్రజల జీవితాలను నాశనం చేస్తాయని, వాటికి దూరంగా ఉండాలని పెంచలయ్య ప్రజలను తన పాటలు మాటలతో చైతన్యవంతం చేసేవారని, అది సహించలేని గంజాయి ముఠా ఆయన్ను అడ్డు తొలగించుకునేందుకు హత్య గావించడం దారుణమంటూ సీపీఎం నాయకులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ, గంజాయి వంటి మత్తుపదార్థాలపై తమ పార్టీ అనునిత్యం పోరాడుతూనే ఉంటుందని హెచ్చరించారు. గంజాయిని తరిమికొట్టాలంటూ గంజాయి దిష్టిబొమ్మను తగులబెట్టి దానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నెల్లూరు నగరంలోని గాంధీ బొమ్మ కూడలి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి గంజాయి ముఠాల కార్యకలాపాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలంటూ వారు డిమాండ్ చేశారు. సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీలకి చెందిన పలువురు నాయకులు, ప్రజా నాట్యమండలి నాయకులు, పలు కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. నెల్లూరురూరల్‌లోని పొట్టేపాళెంలో కూడా సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బంద్ జరిగింది. సీపీఎం నాయకులు జనార్దన్, తిరుపాలు, చంద్రమౌళి, నాగయ్య, రమణయ్య, లక్ష్మీప్రసాద్, మస్తానయ్య తదితరుల ఆధ్వర్యంలో గంజాయి డ్రగ్స్ మాఫియాలకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు.

### కావలిలో రాస్తారోకో :

పెంచలయ్య హత్యకి నిరసనగా జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో నిరసనలు హోరెత్తాయి. కావలి పట్టణంలో వామపక్ష పార్టీల నాయకుల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో జరిగిన ఈ ర్యాలీలో సీపీఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, సీపీఐ నాయకుడు నాగరాజు, ఎంఆర్‌పీఎస్ నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొని గంజాయి ముఠాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లాలో గంజాయి తదితర మత్తుపదార్థాలను పూర్తిస్థాయిలో నిరోధించాలన్నారు. పెంచలయ్యని హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## రోడ్లు బాగు కోసం..
## ముత్తుకూరులో ఆందోళన

ముత్తుకూరు మండలంలో అనేక గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళే ప్రధానమైన రోడ్లు చాలాకాలంగా గుంతలమయమై, రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందని, ముఖ్యంగా ముత్తుకూరు బీసీ కాలనీ నుంచి మామిడిపూడికి వెళ్లే రోడ్డును వెంటనే బాగుచేయించాలని, దాని స్థానంలో కొత్త రోడ్డును నిర్మించాలని పలు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 1న ఆందోళన జరిగింది. ముత్తుకూరులోని సాయిబాబా గుడి వద్ద నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. మండలంలోని అనేక గ్రామాల్లో రోడ్లు గత కొంతకాలంగా అధ్వాన్నంగా ఉంటున్నాయని, వానలు వచ్చినప్పుడల్లా రోడ్లపై ఉన్న గుంతలు వాననీటితో నిండిపోవడంతో, వాహనదారులకు అవి సరిగా కన్పించక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వారు తెలిపారు. ఇకనైనా రోడ్లను పరిశీలించి బాగుచేయించాలని వారు కోరారు. ఈ ఆందోళనలో సీఐటీయు నాయకులు గడ్డం అంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాధయ్య, శ్యామ్ ప్రసాద్, ఆవాజ్ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు షేక్ అక్బర్, మోహిద్ తదితరులు పాల్గొన్నారు.

• రాజ్యసభలో బీఎంఆర్

# జలవనరుల అభివృద్ధిపై ప్రశ్నలు



ఏపీలో పట్టణ జల వనరుల అభివృద్ధి, మురుగు నీటి పునర్వినియోగం, వర్షపు నీటి సేకరణ ప్రాజెక్టులపై రాజ్యసభలో బీఎంఆర్ పలు ప్రశ్నలు అడగ్గా, కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ సహాయ మంత్రి టోఖన్ సాహు వాటికి లిఖితపూర్వక సమాధానాలిచ్చారు. 'అమృత్' పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాల కింద నీటి సరఫరా వ్యవస్థల బలోపేతం, జలాశయాల పునరుజ్జీవనం, భూగర్భ జలాల రీచార్జింగ్ వంటి పనులు చేపడుతున్నామని చెప్పారు. జాతీయ పథకాల కింద మురుగునీటి పునర్వినియోగం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో ప్రాజెక్టులు చేపట్టినట్లు తెలిపారు. 'జల్ సంచయ్–జన భాగీదారి' కార్యక్రమం ద్వారా బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, వర్షపు నీటి సేకరణ నిర్మాణాలు, తక్కువ వ్యయపు వినూత్న నమూనాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అమృత్ పథకం కింద ఉత్తమ పనితీరు కనబరిచిన మున్సిపల్ కార్పొరేషన్లకు ప్రోత్సాహకంగా రూ.50 కోట్ల నిధులు కేటాయించగా, ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.2 కోట్లు ప్రోత్సాహకంగా మంజూరు చేసినట్లు చెప్పారు.

### 'ఉడాన్' పథకం కింద సేవలు విస్తరిస్తున్నాం :

ఆంధ్రప్రదేశ్‌లో సీప్లేన్ సేవల వివరాలపై రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) అడిగిన ప్రశ్నలకు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ లిఖితపూర్వక సమాధానం తెలిపారు. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రాంతీయ విమాన అనుసంధాన పథకం 'ఉడాన్' కింద దేశవ్యాప్తంగా సీప్లేన్ సేవలు విస్తరిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీప్లేన్ సేవల అభివృద్ధి కోసం 10 ప్రాంతాలను వాటర్ ఏరోడ్రోమ్‌లుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. అరకు, గండికోట, కాకినాడ, కోనసీమ, లంబసింగి, నర్సాపురం, ప్రకాశం బ్యారేజ్, రుషికొండ, శ్రీశైలం, తిరుపతి ఆ జాబితాలో ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు, నదీ తీరాలు, సముద్ర తీర ప్రాంతాలకు వేగవంతమైన వైమానిక అనుసంధానం ఏర్పడి, పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

## ఆ విభజన సరికాదు!



బీజేపీ సీనియర్ నేత పేర్నాటి రంగారెడ్డి

ప్రజల మనోభీష్టాలకు వ్యతిరేకంగా జిల్లా విభజన చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు పేర్నాటి రంగారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. నెల్లూరులోని తన స్వగృహం నుంచి ఇటీవల ఆయన ఒక వీడియో విడుదల చేసి, గూడూరును జిల్లాగా చేయండి.. లేదా నెల్లూరులో కలపండి అని కోరారు. అయితే, గూడూరును తిరుపతిలో కలుపుతామంటే ఒప్పుకునేది లేదన్నారు.

ఒక నేత నెల్లూరు జిల్లా ప్రజలకు గాయం చేస్తే.. మరో నేత ఆ గాయాన్ని గెలుకుతున్నారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'రాపూరు కలువాయి ప్రాంతాలను ఎందుకు విడగొడుతున్నారు.. విడగొట్టమని ఎవరు అడిగారు. తిరుపతిలో కలపమని చెప్పింది ఎవరు?.. అంటూ ఆయన ప్రశ్నించారు. కూటమిలో పెద్దలను తాము గౌరవిస్తామని, అయితే కూటమి పేరుతో ప్రజలకే అన్యాయాన్ని చేస్తే సహించేది లేదని, అందరినీ కలుపుకొని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రాపూరు, సైదాపురం, కలవాయి మండలాలను నెల్లూరుజిల్లాలోనే కొనసాగించాలని కూడా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

• లోక్‌సభలో వీపీఆర్

# టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటు వాస్తవమేనా?



ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కుల పథకం కింద నెల్లూరు జిల్లాలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేసిందనేది వాస్తవమేనా అని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం లోక్‌సభలో ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టు వ్యయం రూ. 103 కోట్లు కాగా.. పార్కులో 10యూనిట్లను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలపై ఆయన ప్రశ్నించారు. ఇప్పటివరకు కేవలం రూ. 20 కోట్లు మాత్రమే గ్రాంట్‌గా విడుదల చేశారన్న విషయమై ఆయన వివరాలు కోరారు. అందుకు కేంద్ర జౌళిశాఖ సహాయమంత్రి పబిత్ర మార్గరెటా లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్క్స్ పథకం కింద, ప్రభుత్వం మార్చి 24, 2015న ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో తారకేశ్వర టెక్స్‌టైల్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఆమోదించిందన్నారు. దీని ప్రాజెక్టు వ్యయం రూ. 103.44 కోట్లు కాగా.. పెట్టుబడి మరియు ఉపాధి లక్ష్యం వరుసగా రూ. 223 కోట్లు, 2,275 ఉద్యోగాలన్నారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ రూ.40 కోట్లలో ఇప్పటివరకు రూ.20 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. పార్క్ సాధించిన ప్రస్తుత పెట్టుబడి మరియు ఉపాధి లక్ష్యాలు వరుసగా రూ.87.43 కోట్లు మరియు 480గా ఉందన్నారు. టెక్స్‌టైల్స్ పార్క్ తాజా సమీక్షను ప్రాజెక్ట్ అప్రూవల్ కమిటీ ఈ ఏడాది నవంబర్21న నిర్వహించిందని, పథకం మార్గదర్శకాల ప్రకారం కేంద్రప్రభుత్వ గ్రాంట్ వాటా విడుదల చేయబడిందని పేర్కొన్నారు.

### స్మారక చిహ్నాల సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుండి రాష్ట్రాల వారీగా జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నాలుగా గుర్తించబడిన స్మారక చిహ్నాలు ఎన్ని ఉన్నాయి, ఆ వివరాలేమిటని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. అందుకు, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 3685 పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అవశేషాలను భారత పురావస్తు సర్వే గుర్తించి పర్యవేక్షిస్తోందన్నారు. వాటిలో 135 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నాయని చెప్పారు. గత ఐదు సంవత్సరాలలో పర్యావరణ అభివృద్ధి కోసం కేంద్రం నిధులు విడుదల చేసిందని చెప్పారు. 2020- 21లో 4.57 కోట్లు, 2021- 22లో 5.75 కోట్లు, 2022-23లో 11.60 కోట్లు, 2023- 24లో 14.70 కోట్లు, 2024-25లో 6.50 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# చేనేతలను ఆదుకోండి



గత రెండు నెలలుగా కురుస్తున్న భారీ వర్షాలకు చేనేత మగ్గం గుంటల్లో నీరు చేరి చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలంటూ గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈ నెల 2వ తేదీ గూడూరు నియోజకవర్గ చేనేత కార్మిక సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేసి, ఏ.ఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ రాయవరపు శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షాల కారణంగా గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని గ్రామాల్లో ఉన్న చేనేత కార్మికులు పనులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని అన్నారు. అలాగే చేనేత కుటుంబాలకు సంవత్సరానికి 25వేల రూపాయల నగదు, 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. నారా వెంకటప్పయ్య, జె.మురళి, కన్న బ్రహ్మయ్య, నారాయణ, గురుబాబు, కటికాల శ్రీనివాసులు, సిహెచ్ వెంకటేశ్వర్లు, జక్కం విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి

గంజాయి ముఠా చేతిలో హత్యకు గురైన పెంచలయ్య మృతికి నిరసనగా తిరుపతి జిల్లా గూడూరులోని టవర్ క్లాక్ సెంటర్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ నెల 2న సి.పి.ఎం, సి.ఐ.టి.యు, కె.వి.పి.ఎస్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గంజాయి వ్యాపారానికి వ్యతిరేకంగా, యువతకు అవగాహన కలిగిస్తున్న సి.పి.ఐ(ఎం) కార్యకర్త, ప్రజా కళాకారుడు, ప్రజానాట్యమండలి నెల్లూరు రూరల్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ పెంచలయ్యను గంజాయి ముఠా కత్తులు, గొడ్డళ్ళతో అతికిరాతంగా చంపడం దారుణమన్నారు. హత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. పెంచలయ్య భార్య, ఇద్దరు పిల్లలు అనాధలయ్యారని, వెంటనే ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, బి.వి. రమణయ్య, ఏంబేటి చంద్రయ్య, అడపాల ప్రసాద్, ఎస్.డి.రఫీ, ఎస్.కె.జిలాని భాష తదితరులు పాల్గొన్నారు.

# గూడూరుని నెల్లూరులో కలపాలి

## మంత్రి అనగానికి వినతిపత్రాలు సమర్పించిన ఎమ్మెల్యే సునీల్, జేఏసీ సభ్యులు





గూడూరుని జిల్లా కేంద్రం చేయాలని, లేనిపక్షంలో నెల్లూరు జిల్లాలో కలపాలనే అంశంపై ఇటీవల గూడూరులోని షాది మంజిల్‌లో పలు రాజకీయపార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ సంఘాలు, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. గూడూరు జిల్లా సాధన సమితి పేరుతో ఐకాస ఏర్పాటు చేశారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

### జేఏసీ నిరసన ప్రదర్శన...

గూడూరుని నెల్లూరులో కలపాలంటూ ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు గూడూరు టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఈ నెల1న నిరసన ర్యాలీ నిర్వహించారు. జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన ప్రదర్శనలో ఉపాధ్యాయులు, మహిళలు వందల సంఖ్యలో పాల్గొని 'తిరుపతి వద్దు.. నెల్లూరు ముద్దు' అంటూ నినదించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏ.ఓకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్ మాట్లాడుతూ గూడూరు ప్రజలకు నెల్లూరుజిల్లాతో ఎన్నో సంవత్సరాలుగా అనుబంధం ఉందని, గూడూరుని తిరుపతి జిల్లాలో కలపడంతో గూడూరు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. సీఎం చంద్రబాబు, లోకేష్ గూడూరుని నెల్లూరుజిల్లాలో కలుపుతామని ఇచ్చిన హామీని నెరవేర్చి, ప్రజల ఆకాంక్షను తీర్చాలని కోరారు. జేఏసీ కన్వీనర్ దశరధరామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాలకృష్ణ రాజు, వేగూరు రాజేంద్ర, చిరంజీవి, మోహన్‌దాస్, ప్రభాకర్, జమాల్, పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

### మంత్రిని కలిసిన ఎమ్మెల్యే, జేఏసీ సభ్యులు

గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరుజిల్లాలో కలిపేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలంటూ రాష్ట్ర రెవెన్యూ శాఖా మాత్యులు, తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ని ఈ నెల 2న తిరుపతిలో కలిసిన గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ ఆ మేరకు వినతిపత్రం సమర్పించారు. అలాగే, ఈ నెల 3వతేదీ జేఏసీ సభ్యులు కూడా మంత్రిని, తిరుపతి జిల్లా కలెక్టర్‌ను కలిసి గూడూరుని నెల్లూరుజిల్లాలో కలపాలంటూ వినతి పత్రాలు సమర్పించారు. ఇందుకు మంత్రి అనగాని స్పందిస్తూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

# మహాత్మ జ్యోతిరావు పూలేకి.. నివాళి

మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గూడూరు పట్టణంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆయన చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బండి శ్యాంసుందరరావు(మయూరి శ్యామ్‌యాదవ్) పూలమాల వేసి నివాళులర్పించారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి సంస్కరణలు చేపట్టిన మహానుభావుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ప్రిన్సిపాల్ అంజనమ్మ, ఉపాధ్యాయునిలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



## నేదురుమల్లిని కలసిన నల్లపరెడ్డి

వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డితో మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఈనెల 3న భేటీ అయ్యారు. నెల్లూరులోని రామ్‌కుమార్‌రెడ్డి నివాసంలో మర్యాద పూర్వకంగా ఆయన్ను కలసి, గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపే విషయమై చర్చించారు. వారితో పాటు పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# బాధితులను ఆదుకుంటాం

- సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజ గోపాల్‌రెడ్డి ఈనెల 3న మనుబోలు మండలంలో భారీవర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతులను పకలరించి, ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అన్నదాతలతో పాటు పేదలకు జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భారీవర్షాల బాధితులను ఆదుకుంటామని, వారికి అన్నివిధాలా సాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.


## కళ్యాణ వైభోగం...!

### సంహిత - మిథిలేష్



యాంబర్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేతలు అబ్బూరు వెంకటేష్ - జయలక్ష్మిల కుమార్తె **వేదసంహిత - మిథిలేష్** (పర్వతనేని వెంకటేశ్వరరావు - పద్మజల కుమారుడు)ల పెళ్లి నవంబర్ 27వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. నవ దంపతులకి 'లాయర్' శుభాభినందనలు.

### మనోజ్ - మౌనిక



మాజీ కార్పొరేటర్ మేకల నరేంద్రరెడ్డి - దివంగత పార్వతిరెడ్డిల కుమారుడు **సాయి మనోజ్ కుమార్‌రెడ్డి - మౌనికారెడ్డి** (చిత్తూరు వాస్తవ్యులు మడవనేరి సురేంద్రరెడ్డి - వీణారెడ్డిల కుమార్తెల పరిణయం నవంబర్ 26వ తేదీ చిత్తూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకి 'లాయర్' శుభదీవెనెలు.

### శరశ్చంద్ర-సౌమ్య



నెల్లూరు వాస్తవ్యులు దివంగత మారెళ్ళ సత్యనారాయణరావు - నాగజ్యోతికుమారిల కుమారుడు **వెంకట సాయి శరశ్చంద్ర - సౌమ్య** (హైదరాబాద్ వాస్తవ్యులు యేర్వ బాలరాజు - చంద్రకళల కుమార్తె)ల వివాహం నవంబర్ 27వ తేదీ హైదరాబాదులో ఘనంగా జరిగింది. కొత్త జంటకి 'లాయర్' శుభాశీస్సులు.



## దిత్వా తుఫాన్‌తో..

# నగరం అల్లకల్లోలం!

- ఎక్కడ చూసినా నీళ్ల మడుగులు
- లబోదిబోమంటున్న ప్రజలు



'దిత్వా' తుఫాన్ ప్రభావంతో గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వానలు నెల్లూరును అల్లకల్లోలం చేస్తున్నాయి. ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో తుఫాన్ భీభత్సం సృష్టిస్తోంది. పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. వానలు ఒక మోస్తరు నుంచి భారీగా మారి, బుధవారం, గురువారాల్లో కుండపోత వానతో నగరాన్ని జలదిగ్బంధనం చేశాయి. దీంతో, నెల్లూరు కాస్తా 'నీళ్ళూరు'గా మారిపోయింది. ప్రధాన మైన ట్రంకురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, చిన్నబజారు, పెద్దబజారు వంటి రోడ్లు కూడా మురుగుకాలువల అవతారమెత్తాయి. వానలొస్తే చాలు, రోడ్లు కాలు వలుగా మారడం, సైడుకాలువల్లో మురుగునీరు రోడ్లపైకి రావడంతో అంతా దుర్గంధం అలము కుంటోంది. అంతేకాదు, వానల ధాటికి నగరంలోని అనేక ప్రాంతాలు జలమయం కావడం, పలు కాలనీ ల్లోకి నీటి ప్రవాహం వస్తుండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు నానా బాధలు పడుతున్నారు.

**మురుగు గుంటలుగా రోడ్లు :**

ముఖ్యంగా, నగర శివారుల్లోని చంద్రబాబునగర్, వైఎస్సార్ నగర్, పోలీసు కాలనీ, తల్పగిరి కాలనీ, కల్లూరుపల్లి హౌసింగ్ కాలనీ తదితర కాలనీలతో పాటు, పెన్నా పరీవాహక ప్రాంతాలన్నీ జలమయమై పోయాయి. ఇళ్ల నుంచి జనం బయటకు రాలేక అవస్థలు పడ్డారు. రోడ్లమీద ఉన్న గుంతల్ని ఏళ్ళ తరబడి పూడ్చకపోవడంతో, కాలనీల ప్రాంతాల్లో ఉన్న రోడ్లు ఈ వాన నీటితో నిండిపోయి, ఎక్కడ గుంతలున్నాయో తెలియక వాహనాల వారు ప్రమాదా లకు గురవుతున్నారు. అయ్యప్పగుడి వద్ద నుంచి చంద్రబాబునగర్‌కి వెళ్ళే రోడ్డు గుంతలమయమై పరమ అద్వాన్నంగా ఉంది. వాననీటి ప్రవాహాలతో రోడ్లు చెరువుల్లాగా తయారయ్యాయి. నగరపాలక సంస్థ వారు రోడ్లపైనా, అండర్‌బ్రిడ్జిల కిందా నీటిని తొల గించేందుకు ప్రయత్నాలు చేస్తున్నా, ఆగనివర్షం ధాటికి నీటి ప్రవాహాలు పెల్లుబుకుతూనే ఉన్నాయి. దీనికి తోడు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలచి పోతుండడంతో పలు కాలనీలు అంధకారమయంగా మారాయి.

## జలదిగ్బంధనంలో అండర్‌బ్రిడ్జిలు



నగరంలోని అండర్‌బ్రిడ్జిల వద్ద నీళ్లు ప్రవాహంలా వస్తుం డడంతో రెండు వైపులా దారులు మూసుకుపోతూ, వాహనాల రాకపోకలు నిలచిపోతున్నాయి. రామలింగాపురం, ఆత్మకూరు బస్టాండ్, మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జిల వద్ద నీళ్లు నిలిచి పోవడంతో ట్రాఫిక్ కూడా స్తంభించిపోయింది. మాగుంట లేఅవుట్‌లోని అనేక దుకాణ సముదాయాల్లోకి కూడా వాననీళ్ళు వచ్చి మడుగులు కట్టాయి. నగరంలో ప్రతి ప్రాంతంలోనూ ఉన్న ఖాళీస్థలాలు ఈ వానదెబ్బకి బురదగుంటలయ్యాయి. గత రెండు రోజులుగా వానలు తగ్గకపోవడం, తుఫాను ముసురు పట్టడంతో అత్యధికశాతం మంది నగర పౌరులు ఇళ్లకే పరిమితమయ్యారు.

## వ్యాధుల పట్ల..
# చిన్నారులకు అవగాహన కల్పించాలి




చిన్నారులకు విద్యతో పాటు వ్యాధులపై కూడా అవగాహన కల్పించాలని భగవద్గీత ప్రచారకులు, అభయ్ హిందూ సేన వ్యవస్థాపకులు రాధా మనోహర్ దాస్ అన్నారు. ఈనెల 1న నెల్లూరు, కొండాయపాలెం గేటు, శ్రీకృష్ణ ధ్యాన మందిరం ఆవరణలో గీతా వైభవ ట్రస్ట్, బ్లాక్ బోర్డ్ మిత్ర మండలి, శ్రీసాయి ధ్యాన మందిరం, పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల(పీఎంపీలు) సేవలు సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. ఈ శిబిరాన్ని గీతా ప్రబోధక్ షేక్ నజీర్‌బాషా గురూజీ ప్రారంభించారు. పీఎంపీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జయ ప్రకాష్, అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, బ్లాక్‌బోర్డ్ మిత్ర మండలి అధ్యక్షులు నరసాపురం ప్రసాద్, సభ్యులు బైరి శంకర్రావు, హారిక, పర్వీన్, మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామికి మండల పూజలు

నెల్లూరు వేదాయపాలెంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో ఇటీవల స్వామివారికి కేరళ సంప్రదాయ మండల పూజలు జరిగాయి. స్వామివారికి ఉదయం పాలాభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం, మహా పుష్పాభిషేకం, సాయంత్రం పూలంగి సేవ, మహా దీపారాధన పూజలు చేశారు. ఆదివారం నాడు అర్చకస్వాములు స్వామివారికి పడిపూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గద్దం రత్నయ్య పర్యవేక్షించారు.

# రాష్ట్రస్థాయి 'కౌశల్' పోటీలకు.. వింజమూరు విద్యార్థులు



వింజమూరు జడ్పీపీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు నాటకం గురు విఘ్నేష్, మిదదల వీరేంద్ర రెడ్డిలు రాష్ట్ర స్థాయిలో జరగనున్న 'కౌశల్' క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి. హెచ్ మాల కొండయ్య తెలిపారు. ఈ నెల 28వ తేదీ జరిగిన జిల్లాస్థాయి ఆన్‌లైన్ క్విజ్ పోటీలలో వీరు విజేతలుగా నిలిచినట్లు ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం భారతీయ విజ్ఞాన మండలి వారు వివిధస్థాయిల్లో కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు నిర్వహిస్తుంటారని, ఇందులో భాగంగా సైన్స్, గణితం, సోషల్, వైజ్ఞానిక రంగంలో భారతీయుల కృషి అనే అంశాలపై క్విజ్ నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఆయన అభినందించారు.

# పాతూరి అన్నపూర్ణకి అవార్డు




నెల్లూరుకు చెందిన ప్రముఖ కవయిత్రి, నెరసం ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణకి ఈనెల 1న ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో 'కళామిత్రమండలి జాతీయ పురస్కారం'లో భాగంగా, కరణం జ్ఞానేశ్వరి స్మారక సాహితీ ప్రతిభా అవార్డు అందుకున్నారు. మండలి వెంకటకృష్ణారావు జయంతి వేడుకల సందర్భంగా ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ఈ పురస్కారంతో పాటు సత్కారాన్ని అందుకున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, సీబీఐ విశ్రాంత జేడీ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొని ఆమెకి ఆ పురస్కారాన్ని అందజేశారు.

# 'ఆంధ్ర వాల్మీకి'.. మల్లెమాల



**కీర్తిమూర్తులు**

"అది 2003వ సంవత్సరం-ఆగస్టు15వ తేదీ. అప్పటికి స్వాతంత్ర్యం వచ్చి ఐదున్నర దశాబ్దాలు దాటినా స్వాతంత్ర్య ఫలాలు పేదవాడికి ఆకాశ కుసుమాలుగానే మిగిలిపోయాయి." అని మనసులో అనుకుంటూ ఓ వ్యక్తి తన ఆఫీసులో కూర్చొని ఉన్నాడు. అప్పుడు ఆయన స్మృతిపథంలో భారత మాత రేఖామాత్రంగా గోచరించి ఆమె కళ్ళనిండా దుఃఖాశ్రువులు కనిపించాయి. "మీ కళ్ళలో ఆ దుఃఖాశ్రువులేమిటి తల్లీ!" అని ఆయన ప్రశ్నించాడు. అందుకు భరతమాత బదులిస్తూ.. "నా బిడ్డ గాంధీ ఈ దేశం మరొక రామరాజ్యం కావాలని కలలు కన్నాడు. కానీ ఇప్పటి రాజకీయ నాయకులా సంగతి పూర్తిగా మర్చిపోయ్యారు. అందువలన 'రామకథ'ను నీదైన శైలిలో కావ్యంగా రాసి రాజకీయ నాయకుల కళ్ళు తెరిపించమని" ఆయనను ఆదేశించింది. ఆ తల్లి కోరికమేరకు 3400లకు పైగా పద్యాలతో ఆయన అపూర్వమైన, అద్వితీయమైన "రామాయణ" గ్రంథాన్ని పండిత పామర జనరంజకంగా వెలయించారు. ఆయనే ప్రముఖ కవి, సినీ నిర్మాత మల్లెమాల సుందరరామిరెడ్డి(ఎమ్మెస్ రెడ్డి). 'పద్యం నా ఆరోప్రాణం' అంటూ పై విషయాలన్నీ తన ఆత్మకథ "ఇదీ నా కథ"లో పేర్కొన్నారు మల్లెమాల.

ఎమ్మెస్‌రెడ్డి రచించిన "మల్లెమాల రామాయణం" రెండేళ్ళలోనే 40వేల ప్రతులు ప్రచురితమై పాఠకులను అలరించిందంటే తెలుగు సాహిత్యలోకంలో ఈ రామాయణానికి లభించిన ఆదరణ ఏపాటిదో మనం ఊహించుకోవచ్చు. "ఆ కావ్యంలోని ప్రతి మాట నా నోట రాముడే పలికించాడు" అంటూ మల్లెమాల సవినయంగా తెలపడం శ్రీరామునిపై ఆయనకున్న భక్తిప్రపత్తులకు నిదర్శనం. ఇంత గొప్ప రామాయణాన్ని తెలుగువారికి అందించిన మల్లెమాల 'ఆంధ్ర వాల్మీకి'గా పేరుగడించారు.

**సాహితీ క్షేత్రంలో...**

"కృషితో నాస్తి దుర్భిక్షమ్" అనే సూక్తికి నిలువెత్తు సాక్ష్యం మల్లెమాల. ఉమ్మడి నెల్లూరుజిల్లా బాలాయపల్లి మండలంలోని అలిమిలి అనే చిన్న పల్లెటూరులో 1924 ఆగస్టు 15వ తేదీన జన్మించిన ఆయన, అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ నిబద్ధత, నీతినిజాయితీలతో కృషి చేసి అంచెలంచెలుగా ఎదిగారు. అటు నిజ జీవితంలోనూ, ఇటు సినిమా రంగంలోనూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ ఇంతింతై.. వటుడింతై అన్నట్లుగా ఎంతో ఉన్నతస్థాయికి చేరుకున్నారు. కవిగా, రచయితగా, సినీ నిర్మాతగా ఆయన గడించిన కీర్తి అపారం. "ఆటవెలది కవికి అజ్ఞాత శిష్యుడనని చెప్పుకున్న మల్లెమాల.. మల్లెమాల రామాయణం, వృషభ పురాణం, నివేదన, నిత్య సత్యాలు, భారత రత్నాలు, వివేకానందుడు, ఎందరో మహానుభావులు, వాడని మల్లెలు, తేనెటీగలు, రాయాలని వుంది, భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర, వెండితెర నేపథ్యంలో.., ఇదీ నా కథ (ఆత్మకథ) అనే గ్రంథాలను సాహితీలోకానికి అందించి లబ్ధప్రతిష్ఠులయ్యారు. ఆశువుగా పద్యాలు చెప్పడం మల్లెమాలకి వెన్నతోపెట్టిన విద్య. "మహిత వినయశీల మల్లెమాల" అనే మకుటంతో అత్యద్భుతమైన పద్యాలు రచించారు.

**సినిమా నిర్మాతగా...**

సినీ నిర్మాతగా మల్లెమాల నిర్మించిన భార్య, శ్రీకృష్ణ విజయం, ఊరికి ఉపకారి, కోడెనాగు, ముత్యాలపల్లకి, ఏకలవ్య, పల్నాటి సింహం, బాలలతో 'రామాయణం', తలంబ్రాలు తదితర సినిమాలు ప్రేక్షకాదరణ పొంది ఆయనకు మంచిపేరు తెచ్చిపెట్టాయి. సినిమా రంగంలో అత్యున్నత పురస్కారమైన రఘుపతి వెంకయ్యానాయుడు అవార్డును మల్లెమాల అందుకోవడం ఆ రంగంలో వారు చేసిన కృషికి తార్కాణం.

ఒక ఉన్నత రైతు కుటుంబంలో జన్మించిన మల్లెమాల గారు చిన్నతనం నుంచి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. నిత్యం సమస్యలతో యుద్ధం చేసి విజయం సాధించారు. సినీ రంగంలో గొప్ప నిర్మాతగా, సాహితీ రంగంలో ఉత్తమ కవిగా పేరుప్రఖ్యాతులు సాధించి పలువురికి ఆదర్శప్రాయులుగా నిలిచారు. నిత్యకృషీవలుడైన సహజకవి మల్లెమాల 2011-డిసెంబర్ 11వ తేదీన ఈ లోకాన్ని వీడినప్పటికీ సినీ, సాహిత్య రంగాల్లో ఆయన స్థానం శాశ్వతం!...

(డిసెంబర్ 11, మల్లెమాల వర్ధంతి సందర్భంగా...)



- డా॥ కనియంపాటి రామకృష్ణ
సెల్. 96189 38327

# టూకీగా...



## ముత్తుకూరులో గిరిజనులకు భోజన వసతి

దిత్వా తుఫాన్ కారణంగా ముత్తుకూరు మండలం చలివేంద్ర తుపాన్ షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వందమంది పేద గిరిజనులకు ఈనెల 2న టీడీపీ మండలాధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు రాగాల శివ కృష్ణ, బి.శ్రీనివాసులు, ముత్యంగౌడ్‌లు భోజనం సమకూర్చారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి సూచనలతో ఈ సేవా కార్యక్రమాన్ని వారు నిర్వహించారు.

## కలువాయిలో కార్మిక సంఘాల నిరసనలు

కలువాయి మండలాన్ని నెల్లూరు పరిధిలోనే ఉంచాలంటూ ఈనెల 2న కలువాయిలోని పలు కార్మిక సంఘాల వారు ఆందోళనలు చేశారు. కలువాయిని తిరుపతిలోకి మార్చాలనే ఆలోచనల పట్ల నిరసన వ్యక్తం చేశారు. అలా చేయడం వల్ల ప్రజలకు ఎంతో ఇబ్బంది కలుగుతుందన్నారు. ఆటోకార్మికులు, పలు సంఘాల నాయకులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

## ముసునూరులో మొక్కలు నాటిన దివ్యాంగులు

కావలి సమీపంలోని ముసునూరులో దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఈనెల 2న దివ్యాంగులు మొక్కలు నాటారు. దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మండల వెంకట్రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. చంద్రబాబు నగర్ రైల్వేగేటు వద్ద నుంచి రామ్‌నగర్ వరకు దివ్యాంగులు మొక్కలు నాటడం స్ఫూర్తిదాయకమైంది.

## వింజమూరులో మధ్యాహ్న భోజనం తనిఖీ

వింజమూరు పట్టణంలోని నడిమూరులో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఈనెల 2న ఎంపీడీఓ కె. శ్రీనివాసులురెడ్డి సందర్శించి మధ్యాహ్న భోజనం ఎలా ఉందో తనిఖీ చేశారు. సిబ్బందికి తగు సూచనలిచ్చారు. అందరూ బాగా చదువుకోవాలని విద్యార్థులకు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కోవూరులో అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

కోవూరులోని పెళ్ళకూరు కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఈనెల 2న ఐసీడీఎస్ సీడీపీఓ శారద ఆకస్మికంగా పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆట పాటలతో విద్యను నేర్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రమశిక్షణతో.. ఆదర్శవంతంగా పనిచేయాలని అక్కడి సిబ్బందికి చెప్పారు.

## పార్లపల్లిలో ఎయిడ్స్‌పై ర్యాలీ

విడవలూరు మండలం పార్లపల్లిలో ఈనెల2న ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా, ప్రపంచ ఎయిడ్స్ దినం రోజున ప్రజలకు ఆ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డా. బి.సుజాత, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ డి. ఈశ్వరరావు, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ డా. పద్మప్రియ, విద్యుల్లత, శర్వాణి తదితరులు పాల్గొన్నారు.

## నార్త్ రాజుపాలెంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెంలో ఈనెల 1న అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేకంగా పడిపూజ నిర్వహించారు. అయ్యప్పస్వాములకు అన్నప్రసాదాలను అందజేసిన దేవళ్ళ మోహన్‌రెడ్డి, పేట మధుస్వామిలను సన్మానించారు. గురుస్వాములు సుందర్‌రాజా, మల్లారెడ్డి, నాగేశ్వరరావు, చరణ్‌స్వామి, కుమారస్వామి పాల్గొన్నారు.

## చంద్రపడియలో రైతులకు యూరియా పంపిణీ

వింజమూరు మండలం చంద్రపడియ గ్రామంలోని రైతులకు సొసైటీ ఛైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో ఈనెల 1న యూరియా ఎరువును పంపిణీ చేశారు. అవసరమైన మేరకే యూరియాని వాడుకోవాలని ఆయన రైతులకు చెప్పారు. మండల వ్యవసాయాధికారి వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఇనమడుగు ఆశ్రమంలో గీతాజయంతి

గీతాజయంతిని పురస్కరించుకుని కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో ఉన్న శ్రీ సత్యానందాశ్రమంలో ఈనెల 1న గీతాజయంతి కార్యక్రమాలను నిర్వహించారు.




# ఎన్టీఆర్ నగర్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించండి!

## - ఎన్‌హెచ్ఏ ఛైర్మెన్‌కి.. ఎంపీ వేమిరెడ్డి వినతి

నెల్లూరు నగర పరిధిలో జాతీయ రహదారి-16పై ఎన్‌టీఆర్ నగర్ ఫ్లై ఓవర్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్) చెప్పారు. బుధవారం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఛైర్మన్ సంతోష్‌కుమార్‌యాదవ్‌ను ఢిల్లీలోని ఆయన ఛాంబర్‌లో విపిఆర్ కలుసుకుని ఫ్లై ఓవర్ అంశాలపై చర్చించారు. శ్రీ వేణుగోపాల స్వామి డిగ్రీ కళాశాల, ఎన్టీఆర్ నగర్ సమీపంలో, జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని.. దీంతో ట్రాఫిక్ పెరిగిపోయి చాలా ప్రమాదాలకు కారణమై, అనేకమంది ప్రాణాలు కోల్పోవడం కూడా జరిగిందని ఆయన వివరించారు.

అలాగే, నెల్లూరు జిల్లా కోవూరు అసెంబ్లీ పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం మునిసిపాలిటీ మీదుగా వెళ్లే జాతీయ రహదారి-67పై(ముంచులూరు నుంచి నెల్లూరు వరకు) లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్‌ల నిర్మాణం చేపట్టాలని విపిఆర్ ఆయనకి విజ్ఞప్తి చేశారు. అందుకు సంతోష్‌కుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించినట్లు విపిఆర్ తెలిపారు.

# సుపరిపాలనే ధ్యేయంగా ప్రభుత్వ కార్యక్రమాలు

## ○ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమ్మిళితం చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ నెలలో పెద్దఎత్తున ప్రభుత్వ కార్యక్రమాలు చేపడుతున్నట్లు రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. బుధవారం నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పలు ప్రభుత్వ కార్యక్రమాలపై ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అన్నదాతలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా 'రైతన్నా మీకోసం' చేపట్టడం జరిగిందన్నారు. ఈ నెల 4న పండుగ వాతావరణంలో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ప్రారంభోత్సవం చేస్తామన్నారు. ఈ నెల 5న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో మెగా పేటీఎం(పేరెంట్ టీచర్స్ మీటింగ్) నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

### పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం..

తెలుగుదేశం పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు శిక్షణ, గ్రామాల్లో బూత్‌స్థాయిలో పార్టీ స్థితిగతుల గురించి విశ్లేషణ, భవిష్యత్‌లో పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి ఆనం చెప్పారు. ఆత్మకూరు నియోజక వర్గానికి 8మంది పరిశీలకులను పార్టీ నియమించినట్లు మంత్రి చెప్పారు.

### ముఖ్యమంత్రి దృష్టికి జిల్లా పునర్విభజన సమస్యలు

జిల్లాల పునర్విభజనపై అభ్యంతరాలు తెలిపేందుకు 30రోజుల గడువును ప్రభుత్వం ప్రకటించిందని, ఈలోగా ప్రజలు, ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అభ్యంతరాలను, సలహాలను మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్తామని, మంత్రి ఆనం ఈ సందర్భంగా తెలిపారు. అన్ని విషయాలను కూలంకషంగా చర్చించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుది నిర్ణయం ప్రకటిస్తారని ఆయన స్పష్టం చేశారు.

## నిబద్ధతకు మారు పేరు టీడీపీ - ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ, క్రమశిక్షణ, నిబద్ధతకు మారు పేరు తెలుగుదేశం పార్టీ అని, కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, భవిష్యత్ కార్యక్రమాలకు వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2029 ఎన్నికలే లక్ష్యంగా.. బూత్‌స్థాయిలో లోటుపాట్లను సరిదిద్దుకుని అందరిని సమన్వయం చేసుకుంటూ పార్టీని పటిష్టం చేస్తామన్నారు.

## మాట.. తప్పిన నేతలు

# గర్జిస్తున్న గూడూరు

- ○ ప్రభుత్వ నిర్ణయం సముచితం కాదంటున్న సోమిరెడ్డి
- ○ ఆమరణ దీక్ష చేస్తానంటున్న నల్లపరెడ్డి
- ○ ఉద్యమిస్తున్న గూడూరు ప్రజలు



గూడూరు టవర్‌క్లాక్ సెంటర్‌లో నిరసన తెలియజేస్తున్న జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు

**"ఆశ కన్న దుఃఖ మతిశయంబుగ లేదు" అన్నది పాత సామెత. 'నెరవేరని ఆశ వల్ల కలిగే దుఃఖం చాలా ఎక్కువగా ఉంటుంది' అని దాని అర్థం. పాత నెల్లూరు జిల్లాలోని గూడూరు ప్రాంతవాసుల పరిస్థితి ప్రస్తుతం ఇలాగే వుంది. వారికి అలాంటి దుఃఖమే మిగిలింది.**

వైసీపీ ప్రభుత్వం అప్పట్లో చేపట్టిన జిల్లాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా నెల్లూరుజిల్లాలో వున్న గూడూరు, వెంకటగిరిలని తిరుపతి జిల్లాలో చేర్చింది. అలాగే ప్రకాశం జిల్లాలో వున్న కందుకూరుని నెల్లూరులో కలిపింది. అప్పుడు అందరికీ అంతా బాగానే అనిపించింది. ఆ నిర్ణయాన్ని అప్పట్లో అటు పార్టీలు కానీ ఇటు ప్రజలు కానీ పెద్దగా వ్యతిరేకించ లేదు. ముఖ్యంగా గూడూరువాసులకి మనసులో కొంచం బాధవున్నా బయటపడ లేదు. బహుశా జగన్‌మోహన్‌రెడ్డి ముందు తమ గోడు వెళ్లబోసుకున్నా వృథాప్రయాసే అనుకున్నారు కాబోలు.

ఆ తరువాత 2024లో ఎన్నికలు రానే వచ్చాయి. ఎన్నికల ప్రచారానికి గూడూరు ప్రాంతానికి వచ్చిన కూటమి నాయకులు గూడురుని తిరిగి నెల్లూరులో చేరుస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. ముఖ్యంగా చంద్రబాబు, లోకేష్‌బాబులు తాము అధికారంలోకి వస్తే.. గూడూరు మళ్ళీ నెల్లూరులోనే అని గట్టి హామీ ఇచ్చారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే గూడూరు నెల్లూరులో కలవడం ఖాయం అన్న ఆశలు చిగురించేలా భరోసా కల్పించారు. తాజాగా జిల్లాల పునర్విభజనని పునఃసమీక్షించిన ప్రభుత్వం గూడూరు వాసుల ఆశలపై నీళ్లు చల్లింది. కందుకూరుని మాత్రం ప్రకాశానికి కలిపేసింది.

### రాజకీయ సన్యాసం చేస్తానంటున్న పాశిం సునీల్

అయితే, ఈసారి మాత్రం ఊహించని స్థాయిలో అటు నాయకులు, ఇటు ప్రజలు కూడా సమాంతరంగా స్పందిస్తున్నారు. చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన మాటని నమ్మి గూడూరు శాసనసభ్యుడు పాశిం సునీల్ కుమార్ పునర్విభజన కసరత్తు మొదలు కాకముందే తొందరపడ్డారు. గూడూరుని నెల్లూరులో కలపకపోతే తాను రాజకీయ సన్యాసం చేస్తానని గట్టి శపథం చేశారు. ఇప్పుడు ఆయన కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు.

### నష్టాన్ని వివరిస్తూ లేఖ రాసిన సోమిరెడ్డి...!

మాజీ మంత్రి, ప్రస్తుత సర్వేపల్లి శాసన సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా గూడూరు విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించలేదు. గూడూరు నెల్లూరులో కలపకపోవడం వల్ల కలిగే నష్టాలని వివరిస్తూ మంత్రివర్గ ఉపసంఘానికి ఒక లేఖ రాశారు. జిల్లాల పునర్విభజన ప్రక్రియలో శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఎంతో నష్టపోతుందని ఆ లేఖలో పేర్కొన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తంగా చేసిన విభజనతో శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం, శ్రీసిటీ, మేనకూరు సెజ్‌లతో పాటు అనేక ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలు, పర్యాటక కేంద్రాలను నెల్లూరు జిల్లా ప్రజలు కోల్పోయారని, ప్రస్తుతం జరుగుతున్న పునర్విభజన ప్రక్రియతో జిల్లా ప్రజలు మరింత నష్టపోతున్నారని రాశారు. సాగు, తాగునీటి విషయాల్లోనూ కొత్త సమస్యలు తలెత్తే ప్రమాదం ఏర్పడిందని కూడా ఆ లేఖలో పేర్కొన్నారు.

కందుకూరు డివిజన్ ప్రకాశం జిల్లాలో కలిసిపోతున్న నేపథ్యంలో రామాయపట్నం పోర్టు కూడా నెల్లూరుకు దూరమైపోతోందని, గూడూరు కలిస్తే కనీసం దుగరాజపట్నంలో నిర్మించే నౌకా నిర్మాణ కేంద్రమైనా నెల్లూరుకి దక్కుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తిరుపతి నుంచి గూడూరును వేరుచేసినా వచ్చే నష్టం లేదన్నారు. గూడూరును నెల్లూరుజిల్లాలో కలుపుతామని 2024 ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో పాటు నారా లోకేష్ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. సాగునీరు, త్రాగు నీరుతో పాటు ఇరిగేషన్, రెవెన్యూ పరంగా వచ్చే ఇబ్బందులని కూడా స్పష్టంగా లేఖలో పొందు పరచారు.

### ఆమరణ దీక్ష చేస్తానంటున్న ప్రసన్న..!

ఇక పోయినసారి పునర్విభజన జరిగినప్పుడు వైసీపీ కోవూరు శాసనసభ్యుడిగా వుండిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అప్పుడు జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకించలేదు. గూడూరు విషయంలో నోరు మెదపలేదు. ఈసారి మాత్రం గట్టిగా స్పందించారు. గూడూరుని నెల్లూరులో కలపకపోతే పొట్టి శ్రీరాములు తరహాలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని ప్రతిజ్ఞ చేశారు.

### ఉద్యమిస్తున్న ప్రజలు!

గూడూరులోని వివిధ ప్రజా సంఘాలు, యూనియన్లు ఉద్యమానికి పిలుపునిస్తున్నాయి. అధికారపక్షం ప్రతిపక్షం అన్న తేడా లేకుండా గూడురుని నెల్లూరులో కలిపే విషయంలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో పోరాటానికి సంసిద్ధమవుతున్నాయి. ఇప్పటికే జాయింట్ యాక్షన్ కమిటీ పేరుతో ఉద్యమానికి ఊపిరి పోశాయి. గూడూరుని తిరిగి నెల్లూరులో కలపకపోతే ఒప్పుకునే ప్రసక్తేలేదని గూడూరు ప్రజలు గర్జిస్తున్నారు.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com